# భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు

### చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 24 :** జగిత్యాల జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు వద్ద ఏప్రిల్ 1 నుండి 3 వరకు నిర్వహించనున్న చిన్న హనుమాన్ జయంతి మహోత్సవాల ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మూడు రోజుల పాటు భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించాలని, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, మాలవిరమణ ప్రాంతాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాల్లో విస్తృతంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, వాహనాల రాకపోకలు సజావుగా జరిగేలా సిబ్బందిని నియమించాలన్నారు.


31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 25 మార్చి 2026












## నేడు కాంగ్రెస్‌కు

# జీవన్ రాజీనామా

- పార్టీ పెద్దలు బుజ్జగించిన రాజీనామాకే మొగ్గుచూపిన సీనియర్ నేత
- గౌరవం లేని చోట ఉండలేనన్న జీవన్ రెడ్డి
- నేడు రాజీనామా అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశం
- జీవన్ రెడ్డి నిర్ణయంపై తీవ్ర ఉత్కంఠ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుండి కార్యకర్తలు, అభిమానులు వచ్చే అవకాశం

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 24:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తనకు పార్టీలో జరుగుతున్న అన్యాయం గురించి పలుమార్లు అధిష్టానం, టిపిసిసి దృష్టికి తీసుకెళ్లిన పార్టీలో తనకు తగిన గౌరవం దక్కడం లేదని, ఇటీవలే ఆయన కాంగ్రెస్ పార్టీకి ఈ నెల 25 రాజీనామా చేస్తానని ప్రకటించారు. అయితే నేడు జగిత్యాల పట్టణంలోని బండారి గార్డెన్లో జీవన్ రెడ్డి 10 గంటలకు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఏఐసిసి సభ్యత్వానికి రాజీనామా చేసి భవిష్యత్తు కార్యాచరణ ను ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారి వేడెక్కాయి. జీవన్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. గత 43 ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన తనకు పార్టీలో తగిన గౌరవం ఇవ్వ కుండా, రాష్ట్రంలో ప్రభుత్వం కొనసాగడానికి

-2లో

# రాజీమార్గమే రాజమార్గం

### -జాతీయ మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి
### జగిత్యాల ఎస్పీ అశోక్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 24:** ఈనెల 28న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, జుడిషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్లు, ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## యాసంగి ధాన్యం
# కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

### -కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలి
### -కలెక్టర్ చిత్రా మిశ్రా




**చురకలు ప్రతినిధి కరీంనగర్, మార్చి 24 :** యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధం కావాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రణాళికపై జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది యాసంగి సీజన్ లో 2 లక్షల 73 వేల 550 ఎకరాల్లో వరి ధాన్యం సాగైందని తెలిపారు. 6 లక్షల 46వేల 320 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేస్తున్నామని, 3 లక్షల 67 వేలా 776 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు.జిల్లాలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్, హాకా ద్వారా 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాలు, కో-ఆపరేటివ్, డి ఆర్ డి ఓ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తార్పాలిన్, తేమయంత్రాలు, బరువుతూచే

-2లో

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను వ్యతిరేకిద్దాం



**చురకలు విలేకరి, జగిత్యాల,మార్చి 24 :** జగిత్యాల పట్టణంలోని నలంద డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రముఖ న్యాయవాది, ప్లాస్టిక్ వస్తువుల వ్యతిరేక ఉద్యమకర్త నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు వాడటం వలన కలిగే నష్టాలను, వాటి వలన కలిగే ప్రాణాంతక వ్యాధులను గూర్చి వివరించారు. పండుగలు వేడుకలలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా ఆపివేయాలని, భావి పౌరులైన విద్యార్థులు. రాబోయే శ్రీరామనవమి వేడుకల నుండి ఈ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించే కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువుల తయారీని కూడా ప్రభుత్వము పూర్తిస్థాయిలో నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ శ్రీపాద నరేష్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి, చల్ల లక్ష్మణ్, కామర్స్ అధ్యాపకులు జూపాక మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి నివారణకు అవగాహన కల్పిస్తున్నాం



**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, మార్చి 24 :** క్షయవ్యాధి నివారణకు అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారి డా.వనజ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా.వనజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు టిబి నివారణకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్వో విజయభాస్కర్, షాహేజ్ సుల్తానా, పిహెచ్ఎన్వి హేమలత, స్టాఫ్ నర్స్ రాజేందర్, ఎల్టి నరేష్, సూపర్ వైజర్ టి.సుశీల, ఎంపి హెచ్ఐవో కృపాకర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ బృందం ఆకస్మిక తనిఖీ



**చురకలు విలేకరి,ఇబ్రహీంపట్నం, మార్చి 24 :** ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ తండా ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని మౌళిక వసతులు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజనం వివరాలు, విద్యార్థుల ప్రగతి వివరాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ వరప్రసాద్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల తో మాట్లాడి ప్రగతిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో బృందం నోడల్ అధికారి ఎం.అశోక్, సభ్యులు మహేష్ కుమార్, రాజేందర్, గ్రామ సర్పంచ్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# నేడు కాంగ్రెస్‌కు జీవన్.....

**మొదటి పేజీ తరువాయి....** సరైన బలం ఉన్నప్పటికీ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ఆయన గత కొంతకాలంగా గుర్రుగా ఉన్నారు. పార్టీ ఫిరాయించిన 10 ఎమ్మెల్యేను పక్కన పెట్టాలని పలుమార్లు అధిష్టానం, టిపిసిసి దృష్టికి తీసుకెళ్లిన, రాష్ట్రంలోని 10 నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుండి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా వారికి అజామాషీ ఇవ్వడం ఏమటని ఆయన ప్రశ్నిస్తున్నారు.

**20 నెలలుగా పరిష్కారం కాని సమస్య....**

జగిత్యాల నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన డా.సంజయ్ కుమార్ అభివృద్ధి కోసమే తాను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పని చేస్తున్నానని ప్రకటించి, ఇటీవలే జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను కాదని, ఎమ్మెల్యే వర్గీయులకు కౌన్సిలర్ టిక్కెట్లు కేటాయించడంతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు టిక్కెట్లు కేటాయించకపోవడంతో జీవన్ రెడ్డి తన వర్గానికి చెందిన అసలైన కార్యకర్తలను స్వతంత్రులుగా బరిలో నిలిపి 9 మంది కౌన్సిలర్లుగా గెలిపించారు. కౌన్సిలర్ల ఎన్నిక అనంతరం చైర్పర్సన్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికే చైర్పర్సన్ పదవి కట్టబెట్టాలని జీవన్ రెడ్డి టిపిసిసి దృష్టికి తీసుకెళ్లిన, ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి చెందిన వారికే చైర్పర్సన్ పదవి కట్టబెట్టడంతో ఇక తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని చైర్పర్సన్ ఎన్నిక అనంతరం జీవన్ రెడ్డి వ్యాఖ్యనించారు.

**బుజ్జగింపులకు నో..... .రాజీనామాకే సై....**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తాను కాంగ్రెస్ పార్టీని వీడుతానని ప్రకటించడంతో ఆయనను మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్, ఏఐసిసి కార్యదర్శి సచిన్ సాకేవత్లు కలిసి బుజ్జగించిన చర్చలు విఫలమయ్యాయి. తాను గౌరవం లేని చోట ఉండలేనని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తానని జీవన్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్, ఏఐసిసి కార్యదర్శి సచిన్ సాకేవత్లకు తేల్చిచెప్పారు. తన సమస్యకు ఎవరి వద్ద పరిష్కారం లేదని, పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణలున్నా 10 ఎమ్మెల్యేలను పక్కన పెట్టాలని, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుండా చూడాలని తాను పలుమార్లు అధిష్టానం తీసుకవచ్చిన పట్టించుకోకపోవడంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు జీవన్ రెడ్డి ప్రకటించారు. జీవన్ రెడ్డి సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగి, పార్టీ విధానాలకు విరుద్ధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. నాడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తీసుకవచ్చారని, ఆ ఫిరాయింపుల చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులే పాటించకపోవడం పట్ల ఆయన పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**జీవన్ రెడ్డి నిర్ణయంపై నెలకొన్న ఉత్కంఠ...**

నేడు కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించనున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల దృష్టి జగిత్యాల వైపు మళ్లింది. జీవన్ రెడ్డి నేడు ఉదయం 10 గంటలకు రాజీనామా చేసి తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉండడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. జీవన్ రెడ్డి ఏ పార్టీలో చేరుతారోనని ఉత్కంఠ నెలకొంది. అయితే జీవన్ రెడ్డి తీసుకునే నిర్ణయం కాంగ్రెస్కు ఉత్తర తెలంగాణలో మరో ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే అంతర్గత అసంతృప్తులతో మల్లగుల్లాలు పడుతోంది. మరోవైపు బీఆర్ఎస్కు ఇది జగిత్యాలలో కొత్త బలం కలిగించే అవకాశం. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత ఏ పార్టీలోకి వెళ్లినా, రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. నేడు జరగబోయే కార్యకర్తల సమావేశం = ఒక నిర్ణయం ప్రకటించే వేదిక మాత్రమే కాదు.. ఇది తెలంగాణ రాజకీయాల్లో విలువల రాజకీయాలు వర్సెస్ అవకాశవాద రాజకీయాల మధ్య జరుగుతున్న మౌన పోరాటానికి ప్రతీకగా నిలువనుంది.

### యాసంగి ధాన్యం

# కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

**మొదటి పేజీ తరువాయి ...** యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, డ్రైయర్లు, కాలిపర్స్ వంటి సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ధాన్యం మాత్రమే కోసేలా రైతులకు, హార్వెస్టర్ల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు ధాన్యం, రవాణా తదితర ఏర్పాట్లు నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, డి.ఆర్.డి.ఓ శ్రీధర్, డి.సి.ఓ రామానుజాచార్య, డిఎంఓ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎస్.ఆర్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-సీఎస్ఆర్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి), మార్చి 24 :** సి.ఎస్.ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి పైసంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సిఎస్ఆర్ క్రింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలం పరిధిలో సిఎస్ఆర్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు వాటి ప్రస్తుత స్థితిగతులపై నివేదిక అందించాలని అన్నారు.సింగరేణి ద్వారా రామగుండం పరిధిలో ఐదు కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిఎస్ఆర్ నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పెట్టామని , అవి మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలని అన్నారు. రామగుండం లో ఉన్న గ్రంథాలయ ఆధునికరణ, ఫర్నిచర్, అవసరమైన బుక్స్, ఇతర సదుపాయాల కల్పన కోసం నిధులు వినియోగించాలని కలెక్టర్ తెలిపారు.ఎన్టిపిసి యాష్ పాండ్ వద్ద ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వసించాలని కలెక్టర్ సూచించారు. సీఎస్ఆర్ నిధులతో చేసే అభివృద్ధి పనులకు సంబంధించిన యూసి లు ఎప్పటికప్పుడు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

**-నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు**
**-జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి : డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి**






**చురకలు ప్రతినిధి కోరుట్ల మార్చి 24 :** కోరుట్ల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్ సెంటర్లపై జగిత్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.జైపాల్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఉల్లంఘనలపై కఠినచర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్ ప్రకారం ఆస్పత్రులు క్లినిక్స్ ప్రభుత్వానికి నమోదు అయి నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం సేవలు అందించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.అలాగే పి.సి.పి.ఎన్.డి.టి చట్టం ప్రకారం గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ చేయడం లేదా తెలియజేయడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.ఆడ శిశువుల హత్యలను నివారించేందుకు రూపొందించిన ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినశిక్షలు విధించ బడతాయని హెచ్చరించారు అనుమ తుల కోసం రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్న వైద్యుల ద్వారానే సేవలు అందించాల్సి ఉంటుందని కొత్తగా వైద్యులను నియమించినట్లయితే వారి వివరాలను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లో తప్పనిసరిగా చేర్చాలని సూచించారు .స్కానింగ్ సెంటర్లలో యంత్రాలు డాక్టర్ల అర్హతలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు ఫారం-ఎఫ్‌లను ప్రతినెల 5వ తేదీలోపు సంబంధిత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమర్పించాలని ఆన్లైన్ ఆఫ్లైన్ రికార్డులు ఒకే విధంగా ఉండాలని ఆదేశించారు లింగ నిర్ధారణ నేరమని తెలియజేసే ఫ్లెక్సీలు బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా మాత్రమే కాకుండా మూడు నెలల జైలు శిక్ష విధించబడుతుందని పేర్కొన్నారు అదేవిధంగా సంబంధిత వైద్యుల రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేయబడు తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం సూపర్వైజర్లు నాగభూషణం ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం
# మహనీయుల త్యాగం ఎనలేనిది

**-మహనీయుల జయంతోత్సవ కమిటీ ఏకగ్రీవం,**
**-చైర్మన్‌గా చెన్న కుమార స్వామి నియామకం**



**చురకలు విలేకరి ఎండపల్లి మార్చి 24 :** స్వతంత్ర భారతావనిలో బడుగు బలహీన వర్గాల హక్కులు సామాజిక అసమానతలు రూపు మాపడానికి కృషి చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ మహాత్మా జ్యోతిభా పూలే జయంతోత్స వాల ను పురస్కరించుకుని ఏప్రిల్ మాసంలో జరపనున్న ఉత్సవాలకు ఎండపల్లి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అన్ని దళిత సంఘాలు ఆధ్వర్యంలో మంగళ వారం రాజారాం పల్లి లోని ఎస్ ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కమిటీ ను ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్ గా కొండాపూర్ గ్రామానికి చెందిన చెన్న కుమార స్వామి ని కమిటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి రాబోయే తరాలకు స్ఫూర్తి నింపుతామని అన్నారు.జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్న కుమారస్వామి, గౌరవ అధ్యక్షులు, మంతెన లక్ష్మణ్, కోడి గంగయ్య, చుంచు మల్లేష్,ఉపాధ్యక్షులు రెడ్డిమల్ల తిరుపతి, చీమల కనకయ్య, దూడ భూమయ్య,ప్రధానకార్యదర్శి మంతెన సంజీవ్, దేవి రవీందర్, ముఖ్య సలహాదారులు గజ్జల రాజేశం, వర్కపురం రవి, నేతరి మల్లేశం, ఆరేల్లి మహేష్, చొప్పదండి ,లక్ష్మణ్,సలహాదారులు, బోయిని మధు, ఆ రెల్లి అనిల్,కోశాధికారి వడ్కపురం అశోక్, సంయుక్త కార్యదర్శిలు, బెంబడినరేష్, ఓరగంటి నాగేష్, దావుల అనిల్, సహాయ కార్యదర్శి లు, చిలుక అనిల్, మంతెన స్వామి, ఉప్పులేటి మారుతి, పాక రవీందర్, ప్రచార కార్యదర్శిలు, గౌరీ చిరంజీవి, జంగిలి హనుమాన్లు, దొనకొండ శంకర్, కనుకుట్ల రఘువర్ధన్, కార్యవర్గ సభ్యులు, మన్నె జితేందర్, గుమ్మడి లక్ష్మీనారాయణ, చిన్న సత్తయ్య, కుశనపల్లి రాయమల్లు, దూటా శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి

**చురకలు ప్రతినిధి కోరుట్ల మార్చి 24 :** అర్హులైన రైతులు ముఖ్యంగా నూతనంగా పట్టా పాసుపుస్తకం పొందిన వారు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి మంగళవారం తెలిపారు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం అందించే రైతు భరోసా పథకానికి, ఫిబ్రవరి 28, 2026 వరకు కొత్తగా పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు అర్హులని పేర్కొన్నారు. అలాగే ఇప్పటివరకు ఈ పథకం లబ్ధి పొందని అర్హులైన రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.రైతులు తమకు సమీపంలోని రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు.దరఖాస్తు సమయంలో పట్టా పాసుపుస్తకం ఆధార్ కార్డు బ్యాంక్ పాసుబుక్ వంటి అవసరమైన పత్రాలను తీసుకురావాలని అధికారులు సూచించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు

**-జిల్లా కోర్టు, సబ్ కోర్టుల్లో బాంబ్ డిస్పోజల్ టీం, పోలీసు జగిలాలతో ప్రత్యేక తనిఖీలు**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 24 :** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కోర్టు, సబ్ కోర్టు ప్రాంగణలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం బాంబ్ డిస్పోజల్ టీం, పోలీసు జగిలాలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, కోర్టుల పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో, బాంబ్ డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ హక్కులకు హైకోర్టు రక్షణ కవచం

**-ఏప్రిల్ 9 డెడ్‌లైన్ ఒక పరిపాలనా హెచ్చరిక**

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో దశాబ్దాల కాలం పాటు తమ జీవితాన్ని ధారపోసి, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా పరిగణించడం ఇటీవలి కాలంలో అత్యంత కీలక పరిణామం.ఉద్యోగ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవనానికి ఆసరాగా నిలవాల్సిన గ్రాట్యుటీ, పింఛన్, కమ్యూటేషన్ మరియు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాల చెల్లింపులో నెలకొన్న అసాధారణ జాప్యంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఏప్రిల్ 9వ తేదీని తుది గడువుగా విధించడం పరిపాలనా వ్యవస్థలో ఒక చలనాన్ని తీసుకువచ్చింది.ఇది కేవలం ఒక గడువు మాత్రమే కాదు,ప్రభుత్వ బాధ్యతారాహిత్యంపై న్యాయవ్యవస్థ సంధించిన ఒక సంస్కరణాత్మక అస్త్రం.ఈ వివాదం యొక్క మూలాలను పరిశీలిస్తే, విద్య, వైద్యం, రెవెన్యూ మరియు పోలీస్ వంటి కీలక శాఖల్లో పనిచేసి రిటైర్ అయిన వేల సంఖ్యలోని ఉద్యోగులు తమ న్యాయబద్ధమైన బకాయిల కోసం ఏళ్ల తరబడి కార్యాల యాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్థిక సంక్షోభం లేదా ఖజానా లోటు సాకుతో ఉద్యోగుల హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేసింది. పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాభిక్ష కాదని, అది ఉద్యోగి తన సుదీర్ఘ సేవలకు గానూ పొందే చట్టబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులను ఈ సందర్భంగా హైకోర్టు పునరుద్ఘాటించింది. వృద్ధాప్యంలో వైద్య అవసరాలకు, కుటుంబ బాధ్యతలకు ఆధారమైన ఈ నిధులను నిలిపివేయడం అంటే వారి జీవించే హక్కును భంగపరచడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది. గణాంకాల ప్రకారం ఏటా సుమారు 60 వేల నుండి 80 వేల మంది ఉద్యోగులు విరమణ పొందుతుండగా, అందులో దాదాపు 40 శాతం మంది చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సి రావడం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనం. వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్ లో ఉండటం వల్ల అటు ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతుంటే, ఇటు ప్రభుత్వం ప్రాధాన్యత లేని అంశాలపై నిధులు వెచ్చిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి."సేవలు వినియోగించుకున్న తర్వాత ప్రతిఫలం చెల్లించడంలో మీనమేషాలు లెక్కించడం ఏ రకమైన పాలన?"అని కోర్టు ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వ నైతికతను నిలదీసింది. ఏప్రిల్ 9 నాటికి అన్ని బకాయిలు చెల్లించాలన్న ఆదేశం ఇప్పుడు అధికారులపై ఒత్తిడిని పెంచడమే కాకుండా,బడ్జెట్ కేటా యింపుల్లో మార్పులు చేయాల్సిన అనివార్యతను సృష్టించింది.ఈ తీర్పు ప్రభావం భవిష్యత్తు పరిపాలనపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇకపై పెన్షన్ ఫైళ్ల ప్రాసెసింగ్‌లో జాప్యం జరిగితే అది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందనే భయం అధికారుల్లో నెలకొంది. దీనివల్ల డిజిటల్ పద్ధతుల్లో పారదర్శకమైన, వేగవంతమైన చెల్లింపుల వ్యవస్థ రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అదే సమయంలో, ఉద్యోగ సంఘాలు ఈ తీర్పును ఒక విజయంగా భావిస్తూ, భవిష్యత్తులో జాప్యం జరిగితే వడ్డీతో సహా చెల్లించాలనే డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే నిధుల సమీకరణ చేసి ఈ సంక్షోభం నుండి గట్టెక్కడం ఒక ఎత్తయితే, శాశ్వత ప్రాతిపదికన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటం మరొక ఎత్తు.ముగింపుగా చెప్పాలంటే, హైకోర్టు జోక్యం ప్రభుత్వానికి ఒక మేల్కొలుపు పిలుపు వంటిది.ఈ చారిత్రాత్మక ఆదేశాలు అమలు కావడం ద్వారా వేల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నిండు తుందని,తద్వారా ప్రభుత్వ విశ్వసనీయత పెరుగుతుందని ఆశించవచ్చు. న్యాయ వ్యవస్థ కల్పించిన ఈ రక్షణ కవచం అణగారిన, వృద్ధ ఉద్యోగుల పాలిట ఒక ధైర్యంగా నిలుస్తుంది.

# స్వరసాధనకు స్వర్ణ కిరీటం : జగదీశ్వర్ గానయాత్రకు నంది గౌరవం

**-గాన సరస్వతికి స్వర్ణాభిషేకం:జగదీశ్వర్ సాధనకు స్వర్ణ నంది ప్రతిఫలం**

**-జగదీశ్వర్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించిన సందర్భంగా**



**రామ కిష్టయ్య సంగన భట్ల**

జగదీశ్వర్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించడం తెలుగు గాన ప్రపంచానికి గర్వకారణమైన ఘట్టంగా నిలిచింది. గాత్రంలో గంభీరత, స్వరంలో సౌందర్యం, భావ ప్రకటనలో ఆవేశం---ఈ మూడు లక్షణాల సమన్వయంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న గాయకుల్లో డా. గుండి జగదీశ్వర్ శర్మ ఒక విశిష్ట ప్రతిభ. తెలంగాణ భూమిలోని ఆధ్యాత్మిక క్షేత్రాల వైభవాన్ని తన గాత్రంలో మలచి, భక్తి, జానపదం, శాస్త్రీయతల సమ్మేళనంతో గానయాత్ర సాగిస్తున్న ఆయనకు లభించిన ఈ గౌరవం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా తెలుగు సంగీత సంప్రదాయానికి లభించిన మరొక గౌరవంగా చెప్పుకోవాలి.పవిత్ర గోదావరి నది తీరాన వెలసిన ధర్మపురి క్షేత్రం, దక్షిణ కాశీగా, నవనరసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన ఆధ్యాత్మిక ప్రదేశం. హరిహరులు, బ్రహ్మతో కూడిన త్రిమూర్తుల క్షేత్రంగా ఖ్యాతి గాంచిన ఈ ప్రాంతంలో గుండి హరిప్రియ, హన్మాండ్లు దంపతులకు జన్మించిన జగదీశ్వర్ శర్మ బాల్యంలోనే సంగీతం పట్ల సహజమైన ఆకర్షణను ప్రదర్శించారు. భక్తి వాతావరణంలో పెరిగిన ఆయనకు స్వరాలంటే పూజా విధానంలా మారింది. చిన్ననాటి నుంచే సాధనను జీవిత భాగంగా చేసుకొని, గురువుల మార్గదర్శకత్వంలో స్వర సాధనను క్రమబద్ధంగా అభ్యసిస్తూ, తన గాత్రాన్ని మెరుగు పరచుకున్నారు. ఈ క్రమశిక్షణే ఆయనను గాత్ర సరస్వతిగా తీర్చిదిద్దింది.సంగీత రంగంలో అడుగుపెట్టిన ప్రారంభ దశల నుంచే ఆయన ప్రతిభ ప్రస్ఫుటమైంది. రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా తన గాత్రాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, తెలుగు గాన ప్రపంచంలో తన ప్రత్యేక గుర్తింపును స్థిరపరచు కున్నారు. ముఖ్యంగా ఈటీవీలో ప్రసారమైన 'పాడుతా తీయగా' కార్యక్రమంలో పాల్గొనడం ఆయన జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. గాన గంధర్వుడు ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో తన గాత్రాన్ని ప్రదర్శించడం ద్వారా ఆయన ప్రతిభకు విశేషమైన గుర్తింపు లభించింది. అదే విధంగా జెమినీ టీవీలోని 'నవరాగం' సంగీత పోటీలో సెమీఫైనల్ వరకు చేరుకోవడం ద్వారా, ప్రముఖ గాయకుల ప్రశంసలు పొందిన తొలి తెలంగాణ గాయకుడిగా గుర్తింపు సంపాదించారు.అయితే ఆయన ప్రయాణం టెలివిజన్ కార్యక్రమాలతో మాత్రమే పరిమితం కాలేదు. సంగీత దర్శకులు కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్. పి. పాట్నాయక్ వంటి ప్రముఖులతో కలిసి ఆర్కెస్ట్రా ప్రదర్శనల్లో పాల్గొని, వారి ప్రశంసలను అందుకున్నారు. ఈ అనుభవం ఆయన గాన శైలిలో మరింత నైపుణ్యాన్ని, వైవిధ్యాన్ని తీసుకొచ్చింది. ఇప్పటి వరకు 1600కు పైగా సంగీత విభావరులను నిర్వహించడం ఆయనకు ఒక అరుదైన ఘనత. ఈ కార్యక్రమాలు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించి, ఆయన గాత్రాన్ని విభిన్న వేదికలపై వినిపించాయి. ప్రతి ప్రదర్శనలోనూ శ్రోతల హృదయాలను హత్తుకునే గాత్రమాధుర్యం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానానికి లభించిన అవార్డులు ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇప్పటి వరకు 130కి పైగా అవార్డులు అందుకోవడం ద్వారా ఆయన తన స్థానాన్ని మరింత బలపరచు కున్నారు. ముఖ్యంగా ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం పేరుతో మూడు సార్లు, ఘంటసాల పేరుతో రెండు సార్లు అవార్డులు పొందడం ఆయన గాన ప్రతిభకు అద్దం పడుతుంది. తెలంగాణ రత్న, ప్రతిభా రత్న వంటి బహుమతులు ఆయనకు లభించడం ఆయనకు ఉన్న ప్రజాదరణను తెలియ జేస్తుంది. నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ నుంచి జాతీయ స్థాయిలో 'బెస్ట్ సింగర్'గా అవార్డు పొందడం ఆయన గానానికి దేశవ్యాప్తంగా లభించిన గుర్తింపు. అంతేకాకుండా, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్సులలో 'బెస్ట్ సింగర్'గా స్థానం పొందడం ఆయన ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తీసుకొచ్చింది. 2021లో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం ఆయన గానసేవకు లభించిన అత్యున్నత గౌరవాల్లో ఒకటి. అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అందుకోవడం ఆయన జీవితంలో మరుపురాని ఘట్టంగా నిలిచింది. ఇది ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా తెలంగాణ గాన సంప్రదాయానికి లభించిన గౌరవంగా చెప్పుకోవచ్చు. భక్తి, ఆధ్యాత్మికత, జానపద సంప్రదాయాల మేళవింపుతో ఆయన గానయాత్ర కొనసాగుతోంది. 100కు పైగా ఆడియో సీడీలలో పాల్గొని, వినాయక భక్తి గీతాలు, శ్రీరామ భజనలు, ఆంజనేయ స్తోత్రాలు, జానపద గీతాలు వంటి అనేక గాన రూపాలను ప్రజలకు అందించారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి శతకాలకు ఆయన గాత్రం అందించడం ద్వారా ఆధ్యాత్మిక గానానికి కొత్త పరిమాణాన్ని ఇచ్చారు. ప్రతి గానంలోనూ భక్తి భావాన్ని ప్రతిబింబింపజేసే ఆయన గాత్రం శ్రోతలకు ఆత్మీయ అనుభూతిని కలిగిస్తుంది.సంగీతాన్ని ఆయన కేవలం వృత్తిగా కాకుండా జీవనపథంగా భావించడం ఆయన ప్రత్యేకత. ప్రతి పాటను పూజార్చనగా భావిస్తూ, శ్రద్ధతో, భక్తితో ఆలపించడం ఆయన గానశైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధానం ఆయనను సాధారణ గాయకుడిగా కాకుండా ఆధ్యాత్మిక గాయకుడిగా నిలబెట్టింది. భక్తి, సామాజిక చైతన్యం, సంగీత వైవిధ్యాల సమ్మేళనంతో ఆయన గాన ప్రస్థానం ఒక ఆదర్శంగా నిలుస్తోంది.ఇటీవల శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో స్వర మాధురి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు స్వర్ణ నంది ఉగాది పురస్కారం ప్రదానం చేయడం విశేషం. వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, ఆస్ట్రేలియాలోని వ్యాపారి శేషు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం ఆయన గాన ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. 28 సంవత్సరాల సంగీత ప్రయాణంలో ఇది ఆయనకు లభించిన మూడవ బంగారు నంది పురస్కారం కావడం ప్రత్యేకత. ఈ అవార్డుతో కలిపి ఆయన అందుకున్న మొత్తం అవార్డుల సంఖ్య 135కు చేరుకోవడం ఆయన సాధనకు ప్రతీకగా నిలుస్తోంది.జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానం కేవలం వ్యక్తిగత విజయాల సమాహారం మాత్రమే కాదు; అది ఒక సంస్కృతి, ఒక సంప్రదాయం, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. ఆయన గాత్రం ద్వారా భక్తి పరంపర కొనసాగుతూనే ఉంది. భవిష్యత్ తరాలకు ఆయన ఒక ప్రేరణగా నిలుస్తున్నారు. సాధన, పట్టుదల, వినయం---ఈ మూడు గుణాలు కలిసినపుడే గొప్పతనం సాధ్యమవుతుందని ఆయన జీవితమే స్పష్టంగా చెబుతోంది. తెలుగు గాన ప్రపంచంలో ఆయన స్థానం మరింత ఎత్తుకు ఎదగాలని, ఆయన గాత్రం మరిన్ని హృదయాలను హత్తాలని ఆకాంక్షించాలి.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**చురకలు, విలేఖరి,వెల్గటూర్,మార్చి 24 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట గ్రామంలో మంగళవారం 159 పశువులకు ప్రభుత్వ ఉచిత గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు మండల ప్రాథమిక పశు వైద్యాధికారి పి,శ్రీప్రియ తెలిపారు.పాడి రైతులు ఈ పశువైద్య శిబిరాలను సద్విని యోగం చేసుకొని గాలికుంటు వ్యాదినుండి పశువులను రక్షించు కోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా,బోనగిరి నరేష్ కోరారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి సునీత వెంకటేష్, ఉపసర్పంచ్ అలుగునూరి సతీష్, పుదరి రమేష్ రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**



**చురకలు విలేకరి,బీర్‌పూర్,మార్చి 24 :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బీర పూర్ మండల కేంద్రంలో రూ.1 కోటి 43 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య × కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటు వచ్చేలా చూడాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు బీర్పూర్ మండలానికి చెందిన 28 మంది లబ్దిదారులకు మంజూరైన 28 కళ్యాణలక్ష్మి చెక్కులను ఆయన లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, తహసీల్దార్ సుజాత, మాజీ కెడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు అర్షకోట రాజగోపాల్ రావు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కోటిలింగాల, రామగిరి ఖిల్లాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

**-పార్లమెంటులో గళం విప్పిన పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**




**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మార్చి24 :** తెలంగాణ రాష్ట్రనికి తలమాని కమైన శాతవాహనుల తొలి రాజధాని,తెలుగు బాష పుట్టిల్లు ప్రపంచవ్యాప్త చారిత్రక ప్రదేశం, ప్రముఖ కోటేశ్వరస్వామి శైవ క్షేత్రం, పవిత్ర గోదావరి తీరం కలిగిన జగిత్యాలజిల్లావెల్గటూర్ మండలం లోని కోటిలింగాల చారిత్రక ప్రదేశం తోపాటు పెద్దపల్లి జిల్లారామగిరిఖిల్లాను పర్యాటక కేంద్రాలుగాతీర్చిదిద్దేం దుకు ప్రత్యేక నిధులుకెటాయించి అభివృద్ధి చేయాలని మంగళవారం పార్లమెంట్ లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్నికోరారు. శ్రీముఖుడు పరిపాలించిన శాత వాహన నగర కోట మట్టిలోకప్ప బడి పోగా పురావస్తుశాఖ వారి త్రవ్వకాల తో ప్రపంచ వ్యాప్త చరిత్ర బయటపడ డంతో పాటు శాతవాహనుల తొలి రాజధాని గా గుర్తించబడి ఏళ్ళు గడిచినా ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో మరుగునపడి ఈ చరిత్ర బావితరాలకు తెలియకుండా పోతుందని వెంటనే కేంద్రప్రభుత్వం చొరువ తీసుకుని పురావస్తు శాఖ ద్వారా ఈప్రాంతచరిత్రను బావిత రాలకు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో శాతవాహన తొలిరాజధాని కోటిలింగాలతోపాటు, రామగిరి ఖిల్లా,ధూలికట్ట ప్రాంతాలు అత్యంత ప్రాముఖ్యమైన చారిత్రక ప్రదేశాలుగా ఉండికూడా అభివృద్ధికి నోచుకోవడం లేదని ఈ ప్రాంతాలను గుర్తించి వెంటనేపర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాలు అభివృద్ధి చెందడంతోపాటు ,ప్రజలకు ఉపాధి ఉద్యోగఅవకాశాలు లభిస్తాయన్నారు. కోటిలింగాల చరిత్ర భావితరాలకు తెలియజేసేలా ప్రణాళికలు రూపొం దించాలని, పెద్దపల్లి జిల్లారామగిరి ఖిల్లా రాముడు నడయాడిన నేల, అద్భుత చారిత్రక కట్టడాలు, వన మూలికల ఔషధ క్షేత్రం గా విభిన్న జాతుల వృక్షాలతో ప్రకృతి ప్రేమికు ల్ని ఆకట్టుకునే రామగిరి ఖిల్లా సంపదను కాపాడాలని పార్లమెంట్ లో ఎంపీ గడ్డం వంశీ గళంవిప్పారు. ఈ ప్రాంతాలను టూరిస్ట్ హబ్ గా గుర్తించి వెంటనే అభివృద్ధి చేయాల న్నారు. ఈ విషయంలో ఎన్ని మార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకో వడం లేదని తెలంగాణపై వివేక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెద్దపల్లి పార్ల మెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఈ ప్రాంతాలనుకేంద్రప్రభుత్వం పట్టించుకోవాలని, లేకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఎంపీ వంశీ స్పష్టం చేశారు.

# పారదర్శకమైన ఓటరు జాబితా కోసమే ఎస్.ఐ.ఆర్

**-రాజకీయ పార్టీలు సహకరించాలి**
**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**చురకలు ప్రతినిధి కరీంనగర్, మార్చి 24 :** ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్.ఐ.ఆర్ )ను ఎన్నికల సంఘం చేపట్టిందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇందుకు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారుల తో పాటు రాజకీయ పార్టీలు నియమించుకునే బి.ఎల్.ఎల పాత్ర కూడా కీలకమని అన్నారు. 1951 నుండి ఇప్పటివరకు 8 సార్లు ఎస్ఐఆర్ జరిగిందని చివరగా 2002 నుండి 2004 వరకు నిర్వహించారని తెలిపారు.ప్రత్యేక సమరణ ద్వారా జాబితాలో నిజమైన ఓటరు కచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన, రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఎవరూ అపోహకు గురి కావద్దని సూచించారు. రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను తప్పక నియమించుకోవాలని సూచించారు.ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత ఓటు హక్కు రానివారు ఉంటే ఆక్షేపణ చేయవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్,ఆర్డీఓ రమేష్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.రమణారెడ్డి (బిజెపి),అబ్దుల్లా అసీం,సయ్యద్ బర్కత్ అలీ,సయ్యద్ ఇబ్రహీం (ఏఐఎంఐఎం) ,సాతినేని శ్రీనివాస్ (బిఆర్ఎస్), ఈ.రవీందర్ (టిడిపి), నాంపల్లి శ్రీనివాస్ (బిజెపి) ఎం.వాసుదేవరెడ్డి (సిపిఐ(ఎం)), రామిడి తిరుపతిరెడ్డి వి.నర్సింగం(ఐ.ఎన్.సి) పాల్గొన్నారు.

# మరణంలోనూ మహోన్నత సేవ

**- ఇద్దరికీ వెలుగునిచ్చిన ఫోటోగ్రాఫర్**
**- గుండెపోటుతో ఫోటో గ్రాఫర్ మృతి**
**- నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు**
**- అభినందించిన సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (గోదావరిఖని) మార్చి 24 :** గోదావరిఖనిలోని కాకతీయ నగర్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ కొయ్యడ శ్రీనివాస్ (42) సోమవారం సాయంత్రం గుండె పోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జీవించి ఉన్నప్పుడే తన కెమెరాతో ఎన్నో జీవితాలకు వెలుగులు నింపిన శ్రీనివాస్...మరణానంతరం కూడా ఇద్దరికీ చూపు అందించి నిజమైన మనిషితనాన్ని చాటుకున్నారు.సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు సూచనలతో,ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి భాస్కర్ మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. "శ్రీనివాస్ నేత్రాలు ఇద్దరికీ చూపు ఇస్తాయి" అన్న మాటలు వారి హృదయాలను తాకాయి. తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, మానవత్వానికి అంకితమవుతూ కుటుంబ సభ్యులు గొప్ప నిర్ణయం తీసుకుని నేత్రదానానికి అంగీకరించారు.మంగళవారం వరంగల్ నుంచి ప్రత్యేకంగా గోదావరిఖని వచ్చిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సహకారంతో మృతుని కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించిన తల్లి గౌరమ్మ, భార్య సుజాత, పిల్లలు రిషికేష్, మనశ్రీని, అక్క శారద--బావ తిరుపతి, సోదరుడు కిరణ్, బంధువులు మిట్టపల్లి మహేందర్, నోముల సతీష్, సుమన్,సంగెం రాజు,సదిరం రాజేశం, చిలుక అంజయ్య తదితరులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్,కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణా రెడ్డి,నూక రమేష్,మారెల్లి రాజిరెడ్డి,లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి ,వాసు,వెల్ది కవిత అనంతరాములు, తాడబోయిన రాములు, రఘురామ్, రామగుండం లైన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి.మల్లికార్జున్,రాజేందర్‌తోపాటు ఫోటోగ్రాఫర్లు అభినందించారు. అంతిమయాత్రలో కూడా ఒక వెలుగు దీపంలా నిలిచిన శ్రీనివాస్... తన జీవితం ముగిసినా, మరొకరి జీవితాల్లో కొత్త ఉదయం తీసుకొచ్చాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు నేత్రదాతకు అంత్యక్రియలు నిర్వహించారు.

# యువత బాధ్యతగా మెలిగి దేశాభివృద్ధికి తోడ్పడాలి

**- సి.ఐ. రంజిత్ కుమార్**






**చురకలు ప్రతినిధి,హనుమకొండ, మార్చి 24 :** యువత బాధ్యతాయుతమైన ప్రవర్తనతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని హన్మకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ అన్నారు. హనుమకొండ జిల్లా న్యూశాయంపేట జాగీరులోని పోచంపల్లిలో వరంగల్ వెస్ట్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో సి.ఐ. రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. నేటి యువత దేశానికి వెన్నెముక వంటి వారని, వారు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగితేనే భారతదేశం అన్ని రంగాల్లో సమగ్రా భివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు.సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఐ. వెంకన్న మాట్లాడుతూ, యువత సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సాంకేతికతను దేశాభివృద్ధికి, వ్యక్తిగత ఎదుగుదలకు మాత్రమే వాడుకోవాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత మాట్లాడుతూ కేవలం చదువు మాత్రమే కాకుండా సమాజ సేవను తమ జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక శిబిరం ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించేలా కొనసాగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. మాలతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ సరోజ, జి.పి.ఎస్ పోచంపల్లి హెడ్ మాస్టర్ జి. ఉప్పలయ్య, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా భజన సప్తహ కార్యక్రమం





**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 24 :** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న భజన సప్తాహం కార్యక్రమంలో భాగంగా 6వ రోజు భజన కార్యక్రమం భక్తి భావంతో జరిగింది.ఈ కార్యక్రమంలో కల్వచర్ల గ్రామసర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.ఈ భజన కార్యక్రమంలో కల్వచర్ల శ్రీ సత్య సాయి భజన మండలి కన్వీనర్ నూక రమేష్, జైపూర్ మండలం బెజ్జాల గ్రామానికి చెందిన హనుమాన్ సాయి భజన మండలి భజనపరులు గుజ్జేటి నారాయణ, ఏపూరి రాజేశ్వర్ రావు, గాడిపెల్లి రమేష్, పల్లె సతీష్ గౌడ్, మంతెన ఉదయ్ కిరణ్,మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలతో ఆలయాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.అనంతరం సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి మరియు శివరామకృష్ణ భజన మండలి వారు హనుమాన్ సాయి భజన మండలి భజన పరులను మర్యాద పూర్వకంగా సన్మానించారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 24 :** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ప్రారంభించారు.పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్.వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని పశువులకు టీకాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పశువైద్యశాల సిబ్బంది గ్రామంలో మొత్తం ఆవులకు,గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి మాట్లాడుతూ పశువులను వ్యాధుల నుండి రక్షించేందుకు రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి ఎల్ వో నారాయణ ,గోపాలమిత్రలు కె. కుమార్, ఎం శ్రీనివాస్ ,విజయ్, అసిస్టెంట్ మల్లికార్జున్,స్థానిక రైతులు వైట్ల సాయిరాం ,నాగేశ్వర్ రావు ,ఫణి చంద్ర మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత



**చురకలు విలేకరి, బీర్‌పూర్,మార్చి 24 :** బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన అప్పాల మల్లేశం ఇటీవలే మృతి చెందాడు.ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తుంగూరుశాఖలో ఖాతాదారుడైన మల్లేశంకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా మంజూరైన రూ. 2లక్షల చెక్కును మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మృతునికి కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరీష్,తుంగూరు సర్పంచ్ అర్ధకోట రాజగోపాల్ రావు, మాజీ కెడిసిసి సభ్యులు ముప్పాల రామచంద్రరావు, పిఏసిఎస్ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

**-జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్**
**-భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా పిలుపు**



**కోరుట్ల, మార్చి 24 (చురకలు ప్రతినిధి) :** భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అమరవీరుల స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ రైతు సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు జి. తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు.భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలని,అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని,నాలుగు కార్మిక చట్టాలను మరియు ఇతర కార్పొరేట్ అనుకూల చట్టాలు,విధానాలను తిరస్కరించాలని డిమాండ్ చేశారు.ఇరాన్‌పై యుద్ధం అనైతికమైనది,చట్టవిరుద్ధమైనదని పేర్కొన్నారు.డోనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహులను యుద్ధ నేరస్థులుగా ప్రకటించి,అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినందుకు,సార్వభౌమ దేశమైన ఇరాన్‌పై దాడి చేసినందుకు వారిపై విచారణ జరిగేలా చూడాలని కోరారు.బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తున్నప్పటికీ, గాజా/పాలస్తీనా,వెనిజులా, ఇరాన్‌లలో జరుగుతున్న మారణహోమం వంటి పలు పరిణామాలపై మోదీ ప్రభుత్వం మౌనం వహించిందని విమర్శించారు. అదే సమయంలో మిగతా సభ్య దేశాలు ఈ సమస్యలపై అమెరికా-ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గట్టి వైఖరిని తీసుకున్నాయని తెలిపారు.ఈ అమెరికా అనుకూల సామ్రాజ్యవాద విధానం భారతదేశాన్ని ఇతర ప్రపంచ దేశాల మధ్య ఏకాకిని చేసిందని అన్నారు.రైతులు,కార్మికులు,దేశీయ పరిశ్రమల కీలక ప్రయోజనాలను ప్రభావితం చేసే అసమాన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికాతో మోదీ ప్రభుత్వం అంగీకరించడం వల్ల జాతీయ సార్వభౌమత్వం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి పరిమితం కావడానికి అవకాశం ఉందన్నారు.ఈ నేపథ్యంలో అమెరికా అనుకూల విధానాలకు, ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని రైతులు, మేధావులు కదిలి రావాలని పిలుపునిచ్చారు.

# జీవన్ రెడ్డిని పార్టీ మారవద్దని కోరాం

**-జీవన్ రెడ్డి తమకు తండ్రిలాంటి వారు**
**-జీవన్ సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం**
**-టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మార్చి 24 :**

గత కొంతకాలంగా పార్టీ తనకు గౌరవం ఇవ్వటంలేదని మనస్థాపంతో పార్టీ వీడుతున్న ప్రకటించిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి, జీవన్ రెడ్డిని మంగళవారం జగిత్యాలలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్ కలిశారు. ఈ సమావేశం అనంతరం పీసీసీ అధ్యక్షుడు మీడియా సమావేశంలో ఆయన అభిప్రాయాన్ని వెల్లడించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డిది సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర అని, కాంగ్రెస్ పార్టీతో 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని మ హేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఆయన తమకు తండ్రిలాంటి వారని, రాజకీయంగా ఆయన సీనియర్ నాయకుడు ఒకరిద్దరూ మినహా సీనియర్లు ఎవరు లేరన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇబ్బందులకు గురయ్యారని, కొంత బాధపడ్డారన్నారు. కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆయన కొన్ని ఇబ్బందులు పడ్డ విషయం వాస్తవమేనని, రెండు రోజుల క్రితం శ్రీధర్ బాబు వచ్చి చర్చించారన్నారు. జీవన్ రెడ్డి తెలిపిన సమస్యలను కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని వీడవద్దని జీవన్ రెడ్డిని కోరినట్లు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**నాకు జరిగిన అన్యాయం చాలు...! ఇక నేను కాంగ్రెస్ కండువా కప్పుకోలేను...**

జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసంలో మంగళవారం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆయనను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. తనకు కాంగ్రెస్ పార్టీలో జరిగిన అన్యాయం చాలని, తాను ఇక కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోలేనని ప్రకటించారు. నేడు తాను పార్టీ రాజీనామా చేస్తానని, అనంతరం జరిగే సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో జీవన్ రెడ్డి వెల్లడించినట్లు తెలిసింది.

**కర్మ సిద్ధాంతంఏటుతీసుకెళ్తుందో... తన సమస్యకు ఎవరి వద్ద పరిష్కారం లేదు... మాజీ మంత్రి జీవన్ రెడ్డి..**

కర్మసిద్ధాంతం ఏటు తీసుకెళు తుందోనని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసిసి కార్యదర్శి సచిన్ సాకేవత్తో తో ఆయన భేటి అయ్యి పలు అంశాలపై వారి చర్చించారు. అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తన సమస్య పరిష్కారం కానీ సమస్యగా మారిపోయిందని, సమస్యకు పరిష్కారం వారి వద్ద లేదని, తన వద్ద కూడా లేదన్నారు. పార్టీ మారటం ఇబ్బందికర విషయమన్నారు. నేడు ఉదయం 10 గంటలకు తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని జీవన్ రెడ్డి తెలిపారు. రాజీనామా చేసిన తర్వాత నియోజకవర్గ ప్రజలను కలుస్తానన్నారు. ఇన్నాళ్లు కలిసి ఉండి వీడిపోవటం బాధకరమని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి భవిష్యత్ నిర్ణయం ఏ విధంగా ఉంటుందో తనకు తెలియదని, కర్మసిద్ధంతం ఎటువైపు తీసుకెళ్తుందో వేచి చూడాలని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# జీవన్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు ఆదర్శం

**-పార్టీని వీడవద్దని కోరా...ఆయన సమస్యను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తా**
**-ఏఐసిసి కార్యదర్శి వంశీచందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 24 :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు ఆదర్శమని, పార్టీని వీడవద్దని కోరానని, ఆయన సమస్యను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని ఏఐసిసి కార్యదర్శి వంశీచందర్ రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డితో ఆయన భేటి అయ్యారు. గంటకు పైగా జీవన్ రెడ్డితో వంశీచందర్ రెడ్డి చర్చించారు. అనంతరం ఏఐసిసి కార్యదర్శి వంశీ చందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను జీవన్ రెడ్డి అభిమానిగా ఆయనతో మాట్లాడటానికి వచ్చానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుల్లో జీవన్ రెడ్డి ఒకరని, సీనియర్ నేత జీవన్ రెడ్డి నుండి తాను, ఎంతో మంది కార్యకర్తలు చాలా నేర్చుకున్నారన్నారు. గత కొన్ని నెలలుగా జీవన్ రెడ్డి ఎదుర్కొంటున్న ఇబ్బందులను × కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని, ఆయన తీసుకునే నిర్ణయం ఆయనకే వదిలేస్తున్నామని,ఆయన సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నానన్నారు. జీవన్ రెడ్డికి జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో గాంధేయ వాదిగా మంచి గుర్తింపు ఉందని, 43 ఏళ్ల కాంగ్రెస్లో ఉన్న అనుబంధాన్ని తెంచుకోవద్దని తాను కోరినట్లు తెలిపారు.

## మెట్‌పల్లి ఆర్డీవోకు సన్మానం



**చురకలు విలేకరి,మెట్‌పల్లి,మార్చి 24 :** మెట్ పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గానూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి.నర్సింహరావుని మంగళవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మెట్పల్లి పట్టణ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది ఆకుల ప్రవీణ్, బీఆర్ఎస్ యూత్ నాయకులు మొరపు తేజలు ఆర్డీవోను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన నర్సింహ రావుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా సేవలో ఆయన విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మెట్పల్లి డివిజన్ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## స్వదేశానికి చేరిన మృతదేహం



**చురకలు ప్రతినిధి, కోరుట్ల,మార్చి 24 :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన బొమ్మల మధు(34) అనే కార్మికుడు ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం ఖాతార్ దేశానికి వలస వెళ్లాడు. గత నెల రోజులుగా అనారోగ్యంతో హాస్పిటల్లో భర్తీ కావడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలంగాణ గల్ఫ్ సమితికి సమాచారం ఇవ్వగా అతని ఆరోగ్య పరిస్థితిలో ప్రతిరోజు తెలుసుకుంటూ కుటుంబానికి సమాచారం ఇవ్వగా రోజురోజుకు ఆరోగ్యం క్షీణించి ఈనెల 18న బొమ్మల మధు మృతి చెందాడు. గల్ఫ్ దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కొంచెం చక్కబడంతో వెంటనే మృతదేహాన్ని స్వదేశానికి పంపించడానికి అన్ని ఏర్పాట్లు చేసి మార్చి 23వ తేదీన మృతదేహాన్ని స్వదేశానికి తరలించారు. కష్టాల్లో ఎల్లప్పుడూ తోడుంటున్న తెలంగాణ గల్ఫ్ సమితికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. సాటా వివిధ ప్రాంత అధ్యక్షులు మల్లేశన్, శ్రీనివాస్ మచ్చ, తేజ పళ్లెం తెలంగాణ గల్ఫ్ సమితికి అభినందనలు తెలిపారు.

## జాతీయ మెగా లోక్ ఆదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి

**-జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మార్చి 24 :** ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ ఆదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి కోరారు.మంగళవారం జిల్లా కోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు,ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు,బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను, న్యాయవాదులు, కోర్టులో సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు.ఈ సమావేశంలో న్యాయమూర్తులు నారాయణ,వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

# మహిళా పోలీసుల సాధికారతకు వేదికగా “షీ లీడ్స్ - 2026”

## -కరీంనగర్ పోలీస్ వినూత్న కార్యక్రమం

**చురకలు ప్రతినిధి, కరీంనగర్, మార్చి 24 :** మహిళా పోలీసు అధికారులలో నైపుణ్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో కరీంనగర్ పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు అస్త్ర కన్వెన్షన్‌లో (కాన్ఫరెన్స్ విత్ విమెన్ పోలీస్ ఆఫీసర్స్ 3.0) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ రక్షణలో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కేవలం అధికారం కోసం కాకుండా, రక్షణ మరియు సేవా భావంతో బాధ్యతలు నిర్వహించాలని వారిని ప్రోత్సహించారు .ఒక రోజంతా జరిగిన ఈ సదస్సులో పలు ఆసక్తికరమైన అంశాలపై చర్చలు మరియు అవగాహన కార్యక్రమాలు




నిర్వహించారు. డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ కలాంచే మహిళా అధికారుల్లో మనోధైర్యాన్ని నింపేవిధంగా ప్రసంగాన్ని నిర్వహించారు.

**ఆరోగ్యం మరియు యోగా :** దీప్తి పోషకాహారం,ఆహార నియమాలు మరియు యోగా యొక్క ప్రాముఖ్యతను మహిళా పోలీసు అధికారులకు వివరించారు. విధుల నిర్వహణపై చర్చ: ఏసీపీ హుజూరాబాద్ శ్రీమతి వి. మాధవి బాధితులు,నిందితులు మరియు ఆందోళనకారుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

**వైద్య పరీక్షలు:**

మధ్యాహ్నం సెషన్‌లో మహిళా అధికారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో ఆరోగ్య మహిళ ఆధ్వర్యంలో జనరల్ చెకప్. గైనకాలజీ సంప్రదింపులు,క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు (చల్మెడ ఆనందరావు ఆసుపత్రి). నేత్ర పరీక్షలు (రేకుర్తి చారిటబుల్ ట్రస్ట్) నిర్వహించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి బహుమతులు అందజేసి,అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో అదనపు డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ, ఏసీపీ హుజూరాబాద్ వి మాధవి, ఏసీపీ సీటీసీ వేణుగోపాల్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రజినీకాంత్ , కిరణ్ కుమార్ మరియు కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన మహిళా అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది

## -జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**చురకలు విలేకరి, బీర్ పూర్, మార్చి 24 :** కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బీర్ పూర్ మండలంలోని తాళ్లధర్మారం గ్రామంలో రూ. 10లక్షల నిర్మించనున్న మహిళ సంఘ భవనానికి భూమిపూజ చేసి, రంగాసాగర్ గ్రామంలో రూ. 5లక్షల నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు 57వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేయటం జరిగిందని,తద్వారా మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. మహిళా సంఘం భవనం తో పాటు మహిళలకు 30 లక్షల తో గోదాం నిర్మాణం చేపట్టి ఆరు కిటికీలు పెట్టి అవసరమైనపుడు శుభ కార్యక్రమాలు నిర్వహించ కోవచ్చన్నారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు పరిశుభ్రంగా పచ్చదనంగా ఉండే విధంగా చూడాలన్నారు. జగిత్యాల నియోజకవర్గం ప్రజలు అందరూ తన కుటుంబ సభ్యులని,ప్రభుత్వం అంటే రాష్ట్ర స్థాయి నుండి గ్రామస్థాయి కార్యదర్శి వరకు అని అందరూ కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని, గ్రామాల్లో అటవీ ఏరియాలో ఇప్పటికే



గుడిసె వేసుకుని నివాసం ఉంటున్న వారికి అట్టి స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే అవకాశం పరిశీలిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాల కోసం పుష్కరఘాట్ నిర్మాణానికి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద లక్ష్మణ్, సాగర్, ఉప సర్పంచ్ పద్మ రాజేష్, మాజీ కెడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, ఎంపీడీవో భీమేష్, తహసీల్దార్ సుజాత, మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రమేష్, ఏఈ శ్రీనివాస్, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బుడిగజంగాల కాలనీ “అంజన్న”కు కొత్త శోభ

## -ఆంజనేయ స్వామికి.. తొడుగు బహుకరణ

## -తొడుగు బహుకరించిన ఎజ్జు స్వప్న వేణు దంపతులు

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మార్చి 24 :** హుజురాబాద్ పట్టణం 22, 23 వ వార్డుల పరిధిలోని బుడుగ జంగం కాలనీలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష రూపాయల విలువైన ఇత్తడి తొడుగును ఎజ్జు స్వప్న వేణు దంపతులు మంగళవారం అందజేశారు. పట్టణంలోని ప్రధాన ఆంజనేయస్వామి



ఆలయం, పాటి మీద అంజన్న ఆలయం తర్వాత 22వ వార్డులోని ఈ ఆలయమే ప్రధాన ఆకర్షణగా ఉంది. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాన్ని సందర్శిస్తారు. మంగళ, శనివారాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. నిత్య ధూప దీప నైవేద్యాలతో దేవాలయాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సుమారు 16 సంవత్సరాల క్రితం భక్తులు ఆంజనేయస్వామిని ప్రతిష్టించి ఆలయాన్ని నిర్మించారు. ఆయా పండుగలు పర్వదినాల్లో, శ్రావణ కార్తీక, ధనుర్ మాసాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. అలాగే ప్రతి ఏడాది శ్రీరామనవమికి కళ్యాణం ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనికి పెద్ద సంఖ్యలో భక్తజనం హాజరవుతున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి తొడుగును బహుకరించిన స్వప్న వేణు దంపతుల ను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మాజీ కౌన్సిలర్ పోరెడ్డి రజిత శంతన్ రెడ్డి పృధ్విరాజ్, ఆనంద్ సతీష్ ఎజ్జు రాజు, అభిరామ్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరాలో.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



## -గృహ వినియోగదారులకు ఇబ్బందులు రావొద్దు

## -జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**చురకలు ప్రతినిధి కరీంనగర్, మార్చి 24 :** ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి గ్యాస్ సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. సీతారాంపూర్ లోని నిర్మల భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదాములో మంగళవారం ఆకస్మిక చేశారు. గృహ వినియోగదారుల, వాణిజ్య పరమైన సిలిండర్ల బుకింగ్, స్టాక్ నిల్వలు, రోజు వారీ సరఫరా తదితర వివరాలు ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆస్పత్రులకు సరఫరా అవుతున్న సిలిండర్లు, వాణిజ్యప్రమైన, గృహ అవసరాల సిలిండర్ల సరఫరా వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. స్టాక్ నిలువలు, బుకింగ్ సంఖ్య తదితర వివరాలను ఎప్పటికప్పుడు పౌర సరఫరాల శాఖ కార్యాలయానికి తెలియజేయాలని డీలర్లకు సూచించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు ఉన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎన్సిసి శిబిరం







**చురకలు విలేఖరి,కరీంనగర్, మార్చి, 24 :** విద్యార్థులకు దేశభక్తి పట్ల ఆసక్తిని పెంపొందించాలని మరియు దేశం పట్ల నిర్వర్తించేటువంటి పలు హక్కులను ఽ విధులను ప్రణాళిక బద్ధంగా తెలియపరచాలని తద్వారా వారు బాధ్యతయుతంగా వ్యవహరిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నటువంటి ఎన్సిసి శిబిరం లో శిక్షణ పొందుతున్న కెడెట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి నైతిక విలువల పట్ల కనీస అవగాహనతో పాటు వాటిని అమలుపరిచే విధానాలను తెలుసుకోవాలని వారు సూచించారు. విధేయతతో ప్రవర్తిం చాలని, ఏకాగ్రతతో పనులను చేపట్టాలని తోటి వారితో ప్రేమ ఆప్యాయలతో మెదలాలని మరియు ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించాలని ఈ విధంగా తదితర గుణాలను విద్యార్థులకు తెలియపరచాలని ప్రధానంగా విద్యార్థులు పలు బాధ్యతలను ఎటువంటి సందేహం లేకుండా ఆటంకం లేకుండా నిర్వర్తించాలని చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఎన్సిసి క్రెడిట్లకు ప్రత్యేకత ఉన్నదని మరియు వారికి ఎన్సిసి మార్గదర్శకాలను పాటిస్తూ శిక్షను ఇప్పిస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో సుమారు 150 మంది విద్యార్థులకు శిక్షణతో పాటు భోజన వసతిని కల్పిస్తున్నామని తెలుపుతూ ప్రభుత్వం వారి ఆదేశాను సారం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎవరు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా అత్యంత నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేయడంతో పాటు యజమాన్యానికి కృతజ్ఞత తెలిపారు ఎన్సిసి అధికారులు సైతం చక్కటి వసతులను కల్పించిన నరేందర్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్సిసి అధికారులు సిద్దిపేట, కరీంనగర్ లిసిరిసిల్ల పాఠశాలల నుండి విచ్చేసిన క్రెడిట్ లు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో

# ఎన్సిసి శిబిరం




**చురకలు విలేఖరి కరీంనగర్, మార్చి, 24:** విద్యార్థులకు దేశభక్తి పట్ల ఆసక్తిని పెంపొందించాలని మరియు దేశం పట్ల నిర్వర్తించేటువంటి పలు హక్కులను & విధులను ప్రణాళిక బద్ధంగా తెలియపరచాలని తద్వారా వారు బాధ్యతయుతంగా వ్యవహరిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నటువంటి ఎన్సిసి శిబిరం లో శిక్షణ పొందుతున్న కెడెట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి నైతిక విలువల పట్ల కనీస అవగాహనతో పాటు వాటిని అమలుపరిచే విధానాలను తెలుసుకోవాలని వారు సూచించారు. విధేయతతో ప్రవర్తించాలని, ఏకాగ్రతతో పనులను చేపట్టాలని తోటి వారితో ప్రేమ ఆప్యాయలతో మెదలాలని మరియు ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించాలని ఈ విధంగా తదితర గుణాలను విద్యార్థులకు తెలియపరచాలని ప్రధానంగా విద్యార్థులు పలు బాధ్యతలను ఎటువంటి సందేహం లేకుండా ఆటంకం లేకుండా నిర్వర్తించాలని చెప్పారు అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఎన్సిసి క్రెడిట్లకు ప్రత్యేకత ఉన్నదని మరియు వారికి ఎన్సిసి మార్గదర్శకాలను పాటిస్తూ శిక్షను ఇప్పిస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో సుమారు 150 మంది విద్యార్థులకు శిక్షణతో పాటు భోజన వసతిని కల్పిస్తున్నామని తెలుపుతూ ప్రభుత్వం వారి ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎవరు చెప్పారు.విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా అత్యంత నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేయడంతో పాటు యజమాన్యానికి కృతజ్ఞత తెలిపారు ఎన్సిసి అధికారులు సైతం చక్కటి వసతులను కల్పించిన నరేందర్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్సిసి అధికారులు సిద్దిపేట, కరీంనగర్ లిసిరిసిల్ల పాఠశాలల నుండి విచ్చేసిన క్రెడిట్ లు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు






# రామనామంలో పాప విమోచనం నీలకంఠ శర్మ ప్రవచనం

గోదావరీ నదీమతల్లి తరంగాల గలగలలు, వేదమంత్రాల ఘోష, భక్తి పారవశ్యంతో పులకించిన ఆధ్యాత్మిక వాతావరణం నడుమ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీ రామనవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. భక్తి, శాస్త్ర, సంప్రదాయాల త్రివేణీ సంగమంగా వెలుగొందుతున్న ఈ వేడుకలలో భాగంగా నిర్వహించిన ప్రవచన కార్యక్రమం భక్తుల పాలిట జ్ఞానగంగగా మారింది. ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత శాఖా పూర్వాధిపతి, ప్రఖ్యాత సంస్కృత పండితులు ఆచార్య కశజ్జల నీలకంఠ శర్మ గారు అందించిన ప్రవచనం రామాయణ పరమార్థాన్ని, రామనామ వైశిష్ట్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఆలయ ప్రధానార్చకులు తాడూరి రఘునాథ శర్మ మార్గదర్శకత్వంలో, వంశపారంపర్య అర్చకులైన తాడూరి బాలకృష్ణ శర్మ, బలరాం శర్మ, బాలచందర్ శర్మ, మోహన శర్మల శాస్త్రోక్త నిర్వహణలో సాగిన ఈ సభ భక్తులలో నూతన ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది. రామాయణం అనేది కేవలం గతించిన కాలపు కథ కాదని, అది నిత్య



నూతనమైన ధర్మశాస్త్రమని, మానవజాతికి దిశానిర్దేశం చేసే జీవన వేదమని నీలకంఠ శర్మ గారు సోదాహరణంగా వివరించారు. స్కాంద పురాణంలోని అంతరార్థాన్ని స్పృశిస్తూ, నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు సూత మహర్షిని అడిగిన ప్రశ్నను ఆయన గుర్తుచేశారు. కలియుగంలో మానవుడు అనంతమైన పాప పంకిలం నుండి విముక్తి పొంది మోక్షాన్ని సాధించడానికి అత్యంత సులభమైన మార్గం ఏమిటన్న ప్రశ్నకు, సూత మహర్షి అందించిన ఏకైక సమాధానం "రామాయణ పఠనం" అని ఆయన నొక్కి చెప్పారు.వాల్మీకి మహర్షి కలం నుండి జాలువారిన ప్రతి శ్లోకం ఒక ఉపనిషత్తు సారమని, అది భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలను సమన్వయం చేస్తూ మానవుడిని మాధవునిగా తీర్చిదిద్దుతుందని ఆయన వివరించారు. రామకథను వినడం వల్ల కలిగే పుణ్యఫలం అశ్వమేధాది యజ్ఞయాగాల కంటే మిన్న అని పురాణాలు ఘోషిస్తున్నాయని, ఇది కేవలం పుణ్యం కోసమే కాకుండా చిత్తశుద్ధికి, ఆత్మజ్ఞానానికి రాజమార్గమని ఆచార్యులు పేర్కొన్నారు. ముఖ్యంగా "రామ" అనే రెండక్షరాల మంత్రంలోని అద్భుత శక్తిని వివరిస్తూ శృంగేరి పీఠాధిపతుల అమృత వాక్కులను ఉదహరించారు. 'రా' అనే అక్షరాన్ని ఉచ్చరించినప్పుడు నోరు తెరచుకుని లోపల ఉన్న పాపాలు బయటకు విసర్జించబడతాయని, 'మ' అని పలికినప్పుడు పెదవులు మూతపడి ఆ పాపాలు తిరిగి లోపలికి ప్రవేశించకుండా దహించబడతాయని చెప్పడం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. శృంగేరి భారతీ తీర్థ స్వామి వారు రచించిన 'రామ కర్ణామృతం'లోని విశేషాలను ప్రస్తావిస్తూ, రామనామ జపం మనస్సును ఏకాగ్రత వైపు మళ్లించి భక్తిని పరిపక్వం చేస్తుందని వివరించారు. ఈ క్రమంలోనే ఆయన వినిపించిన సౌదాసుని వృత్తాంతం భక్తులలో గొప్ప ఆలోచనను రేకెత్తించింది. శ్రీరాముని ఆదర్శప్రాయమైన జీవితం సత్యవాక్పరిపాలన, పితృవాక్య పరిపాలన, ఏకపత్నీ వ్రతం వంటి గుణాలు కేవలం త్రేతా యుగానికే పరిమితం కాదని, నేటి సమాజంలో ప్రతి వ్యక్తి అలవరచుకోవాల్సిన కనీస ధర్మాలని ఆయన పిలుపునిచ్చారు. రామాయణం వ్యక్తి నిర్మాణానికి, తద్వారా సమాజ నిర్మాణానికి పునాది అని, రాముడు నడిచిన బాటలో నడవడమే అసలైన రామారాధన అని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక ఉన్నతికి, పాప విమోచనానికి రామనామమే పరమౌషధమని, గోదావరీ తీరాన వెలసిన ఈ క్షేత్రం అటువంటి మహత్తర ప్రవచనాలకు వేదిక కావడం భక్తుల అదృష్టమని పండితులు కొనియాడారు. చివరగా, పండిత సత్కారంతో ముగిసిన ఈ కార్యక్రమం భక్తులకు కేవలం ఒక ప్రవచనంగా కాకుండా, వారి జీవిత గమనాన్ని మార్చే ఒక దివ్య బోధనగా మిగిలిపోయింది. దేవాలయ అర్చకుల సమర్పణలో సాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం రామనామ మహిమను పదికాలాల పాటు చాటిచెప్పేలా ఉంది.

**-రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**

# జగిత్యాల రాజకీయాల్లో జీవన్ రెడ్డి కొత్త దిశ!

### నేడే జీవన్ కీలక ప్రకటన

**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)**

జగిత్యాల రాజకీయాల్లో మరో కీలక మలుపు ఆవిర్భవించబోతుంది. ఇది కేవలం ఒక నాయకుడి పార్టీ మార్పు కథ కాదుడ నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నిబద్ధత, ఆశలు, అవమానాలు, మరియు ప్రాంతీయ రాజకీయాల లోతైన అంతర్గత పోరాటాల ప్రతిబింబం. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తీసుకోబోయే నిర్ణయం వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు.. జగిత్యాల రాజకీయ దిశను, ఉత్తర తెలంగాణ శక్తి సమీకరణాలను, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య పోటీతత్వాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లే శక్తి కలిగిన పరిణామం ఇది.ఈ నెల 25న బుధవారం తన కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించి, తన రాజకీయ భవిష్యత్‌పై కీలక నిర్ణయం ప్రకటించనున్నారు. ఇది సాధారణ సమావేశం కాదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో ముడిపడిన ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మలుపు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన అసంతృప్తి, స్థానిక సమీకరణాల్లో ఏర్పడిన వివక్ష ఇవన్నీ ఆయనను ఈ నిర్ణయానికి దారి తీశాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 24 మంగళవారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి జగిత్యాలలో భేటీ అయ్యారు. అయితే, తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లు జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి వచ్చినా.. తాను కాంగ్రెస్ పార్టీలో నిలువగలిగే పరిస్థితులు లేవని ఖరాఖండిగా చెప్పేశారు. ఇప్పటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో కొనసాగడం కుదరదని ఆయన ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. రైతు కుటుంబం నుంచి రాజకీయ శిఖరాల వరకు 1951 జనవరి 5న జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికే పెల్లి గ్రామంలో జన్మించిన జీవన్ రెడ్డి సాధారణ రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగారు. న్యాయవాదిగా వృత్తి ప్రారం భించిన ఆయన 1981లో పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. 1983లో టీడీపీ తరపున జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఎన్టీఆర్ కేబినెట్‌లో ఎక్సైజ్ మంత్రిగా పని చేశారు. 1984లో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత 1989 నుంచి 2004 వరకు పలుమార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో రోడ్లు & భవనాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.
2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌కు ఏకైక విజయం జగిత్యాల్లోనే సాధించిన ఘనత ఆయనది. 2019లో ఎమ్మెల్సీగా కూడా ఎన్నికయ్యారు. ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, రెండు సార్లు మంత్రి ఇది ఆయన రాజకీయ జీవితం సాధించిన స్థాయి. జగిత్యాల ప్రజలు "జీవనన్న"గా పిలిచే ఆయన స్థానిక సమస్యలు, రైతు అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన నాయకుడిగా ప్రసిద్ధి చెందారు.

**స్థానిక అసంతృప్తి నుంచి నిర్ణయం వరకు**

2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదుర్కొన్న జీవన్ రెడ్డి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌తో సంబంధాలు దెబ్బతిన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు, చైర్‌పర్సన్ ఎంపికలో తన వర్గానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, పదవుల పంపకాల్లో ఏర్పడిన వివక్ష ఇవన్నీ ఆయనలో తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. పార్టీ అధిష్టానానికి పలుమార్లు తన అభ్యంతరాలు తెలిపినా సమాధానం లభించకపోవడంతో ఆయన తన రాజకీయ భవిష్యత్‌పై పునరాలోచన చేశారు. గత 20 నెలలుగా తాను మానసిక క్షోభ, అవమానాలు భరిస్తున్నట్లు ఆయన ఇటీవలే బహిరంగ లేఖలో వెల్లడించారు. ఇప్పుడు ఆయన కార్యకర్తల సమావేశంలో తీసుకోనున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. **రాజకీయ పరిణామాలు ఏమిటి?**

జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్‌కు ఉత్తర తెలంగాణలో మరో ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే అంతర్గత అసంతృప్తులతో మల్లగుల్లాలుపడుతోంది. మరోవైపు బీఆర్ఎస్‌కు ఇది జగిత్యాలలో కొత్త బలం కలిగించే అవకాశం. కానీ రాజకీయ మార్పులు ఎప్పుడూ ఊహించని ట్విస్టులను తీసుకొస్తాయి. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత ఏ పార్టీలోకి వెళ్లినా, జగిత్యాల సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. మార్చి 25న జరగబోయే కార్యకర్తల సమావేశం ఒక నిర్ణయం ప్రకటించే వేదిక మాత్రమే కాదు.. ఇది తెలంగాణ రాజకీయాల్లో విలువల రాజకీయాలు వర్సెస్ అవకాశవాద రాజకీయాల మధ్య జరుగుతున్న మౌన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒక వైపు నలభై ఏళ్ల విశ్వాసానికి ముగింపు పలకాల్సిన పరిస్థితి, మరోవైపు భవిష్యత్‌లో ప్రభావాన్ని నిలబెట్టుకోవాలనే రాజకీయ అవసరం, ఈ రెండు దారుల మధ్య నిల్చున్న జీవన్ రెడ్డి ఎంచుకునే మార్గం కేవలం ఆయనకే కాదు, ఆయనను నమ్ముకున్న వేలాది కార్యకర్తలకు, జగిత్యాల ప్రజలకు, మరియు మొత్తం రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేసే తీర్పుగా మారబోతోంది. ఈ పరిణామం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది.. పార్టీలు మారినా, నాయకులు మారినా, ప్రజల ఆశలు మాత్రం మారవు. నాయకుల వ్యక్తిగత నిర్ణయాలు కంటే పెద్దది ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే మార్గమే నిజమైన రాజకీయ విజయానికి ప్రమాణం. ఇక జీవన్ రెడ్డి తీసుకునే అడుగు.. చరిత్రలో ఒక అధ్యాయం ముగింపా? లేక కొత్త అధ్యాయం ఆరంభమా?.. అన్నది మరికొన్ని గంటల్లో స్పష్టమవుతుంది.

# రిటైర్మెంట్ హక్కులకు హైకోర్టు రక్షణ కవచం

**-రిటైర్మెంట్ హక్కులకు హైకోర్టు రక్షణ కవచం: ఏప్రిల్ 9 డెడ్‌లైన్ ఒక పరిపాలనా హెచ్చరిక**




ఏప్రిల్ 9 డెడ్‌లైన్ ఒక పరిపాలనా హెచ్చరిక

రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో దశాబ్దాల కాలం పాటు తమ జీవితాన్ని ధారపోసి, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా పరిగణించడం ఇటీవలి కాలంలో అత్యంత కీలక పరిణామం. ఉద్యోగ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవనానికి ఆసరాగా నిలవాల్సిన గ్రాట్యుటీ, పింఛన్, కమ్యూటేషన్ మరియు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాల చెల్లింపులో నెలకొన్న అసాధారణ జాప్యంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఏప్రిల్ 9వ తేదీని తుది గడువుగా విధించడం పరిపాలనా వ్యవస్థలో ఒక చలనాన్ని తీసుకువచ్చింది. ఇది కేవలం ఒక గడువు మాత్రమే కాదు, ప్రభుత్వ బాధ్యతారాహిత్యంపై న్యాయవ్యవస్థ సంధించిన ఒక సంస్కరణాత్మక అస్త్రం. ఈ వివాదం యొక్క మూలాలను పరిశీలిస్తే, విద్య, వైద్యం, రెవెన్యూ మరియు పోలీస్ వంటి కీలక శాఖల్లో పనిచేసి రిటైర్ అయిన వేల సంఖ్యలోని ఉద్యోగులు తమ న్యాయబద్ధమైన బకాయిల కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్థిక సంక్షోభం లేదా ఖజానా లోటు సాకుతో ఉద్యోగుల హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేసింది. పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాభిక్ష కాదని, అది ఉద్యోగి తన సుదీర్ఘ సేవలకు గానూ పొందే చట్టబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులను ఈ సందర్భంగా హైకోర్టు పునరుద్ఘాటించింది. వృద్ధాప్యంలో వైద్య అవసరాలకు, కుటుంబ బాధ్యతలకు ఆధారమైన ఈ నిధులను నిలిపివేయడం అంటే వారి జీవించే హక్కును భంగపరచడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది. గణాంకాల ప్రకారం ఏటా సుమారు 60 వేల నుండి 80 వేల మంది ఉద్యోగులు విరమణ పొందుతుండగా, అందులో దాదాపు 40 శాతం మంది చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సి రావడం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనం. వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల అటు ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతుంటే, ఇటు ప్రభుత్వం ప్రాధాన్యత లేని అంశాలపై నిధులు వెచ్చిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "సేవలు వినియోగించుకున్న తర్వాత ప్రతిఫలం చెల్లించడంలో మీనమేషాలు లెక్కించడం ఏ రకమైన పాలన?" అని కోర్టు ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వ నైతికతను నిలదీసింది. ఏప్రిల్ 9 నాటికి అన్ని బకాయిలు చెల్లించాలన్న ఆదేశం ఇప్పుడు అధికారులపై ఒత్తిడిని పెంచడమే కాకుండా, బడ్జెట్ కేటాయింపుల్లో మార్పులు చేయాల్సిన అనివార్యతను సృష్టించింది. ఈ తీర్పు ప్రభావం భవిష్యత్తు పరిపాలనపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇకపై పెన్షన్ ఫైళ్ల ప్రాసెసింగ్‌లో జాప్యం జరిగితే అది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందనే భయం అధికారుల్లో నెలకొంది. దీనివల్ల డిజిటల్ పద్ధతుల్లో పారదర్శకమైన, వేగవంతమైన చెల్లింపుల వ్యవస్థ రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అదే సమయంలో, ఉద్యోగ సంఘాలు ఈ తీర్పును ఒక విజయంగా భావిస్తూ, భవిష్యత్తులో జాప్యం జరిగితే వడ్డీతో సహా చెల్లించాలనే డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే నిధుల సమీకరణ చేసి ఈ సంక్షోభం నుండి గట్టెక్కడం ఒక ఎత్తయితే, శాశ్వత ప్రాతిపదికన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటం మరొక ఎత్తు. ముగింపుగా చెప్పాలంటే, హైకోర్టు జోక్యం ప్రభుత్వానికి ఒక మేల్కొలుపు పిలుపు వంటిది. ఉద్యోగికి విరమణ రోజునే అన్ని ప్రయోజనాలు అందజేయడం అనేది ఆరోగ్యకరమైన పాలనకు గీటురాయి. ఈ చారిత్రాత్మక ఆదేశాలు అమలు కావడం ద్వారా వేల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నిండుతుందని, తద్వారా ప్రభుత్వ విశ్వసనీయత పెరుగుతుందని ఆశించవచ్చు. న్యాయవ్యవస్థ కల్పించిన ఈ రక్షణ కవచం అణగారిన, వృద్ధ ఉద్యోగుల పాలిట ఒక ధైర్యంగా నిలుస్తుంది.

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

## భారీగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, మార్చి 24:** మంగళవారం పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పున్న గంగరాజు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రావణ చేస్తుండగా కరీంన గర్ రూరల్ పోలీసులు జూబ్లీ నగర్ గ్రామంలో పట్టుకున్నారు, మరియు నిన్నటి రోజున రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కన్నం గంగరాజు, కన్నం ప్రశాంత్, దుర్శేడ్ గ్రామానికి చెందిన సుంకిశాల సాయి కృష్ణ రావు మరియు కిసాన్ నగర్ కరీంనగర్ కు చెందిన నీరుకుల్లా అనిల్ కుమార్ అనువారు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా దుర్శేడ్ గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించనైనది. ఇంతకుముందు కూడా అక్రమ ఇసుక రవాణా చేసి మళ్లీ పట్టుబడిన ట్రాక్టర్లను వేలం వెయ్యడం కొరకు ఎమ్మార్వో కి అప్పజెప్పడమైనది, అట్టి నిందితులను ఎమ్మార్వో ముందు హాజరు పరిచి లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేయడమైనది అని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.



## జీవన్ రెడ్డి మరో రాజకీయ ప్రయాణం పార్టీపై అసంతృప్తి పర్వం... మార్పు లేని జీవన్ రెడ్డి నిర్ణయం

# విరమణ కాదు విప్లవ నిర్ణయం?...

తెలంగాణ రాజకీయాలలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణా మాలు, ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ కురువృద్ధుడు తాడిపర్తి జీవన్ రెడ్డి చుట్టూ నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, రాష్ట్ర రాజకీయ దిశను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధాన్ని కొనసాగించిన జీవన్ రెడ్డి పార్టీని వీడే దిశగా ముందడుగు వేయడం, ఆ నిర్ణయంపై అధిష్ఠానం చేసిన చర్చలు, సమన్వయ యత్నాలు, వాటి ఫలితం లేకపోవడం ఇవి ఒక పెద్ద రాజకీయ మార్పు సంకేతాలుగా విశ్లేషించ బడుతున్నాయి. జగిత్యాలలో జరిగిన తాజా పరిణామం ఈ సంక్షోభాన్ని మరింత గంభీరతరం చేసింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి, పార్టీ వీడవద్దని చేసిన విజ్ఞప్తులు సఫలీకృతం కాలేదు. మంగళ వారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, పార్టీ విప్ అది శ్రీనివాస్ తదితర కీలక నేతలు స్వయంగా జగిత్యాలకు చేరుకుని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సమావేశం కావడం ఈ వ్యవహారానికి ఉన్న ప్రాధాన్యాన్ని స్పష్టంగా తెలియ జేస్తుంది. సాధారణంగా స్థానిక స్థాయి అసంతృప్తులను జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలోనే పరిష్కరించే కాంగ్రెస్ పార్టీ, ఈ సందర్భంలో నేరుగా జాతీయ స్థాయి ప్రతినిధులను పంపడం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది. అయితే ఈ సమావేశం ద్వారా ఆశించిన ఫలితం సాధ్యం కాలేదని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జీవన్ రెడ్డి తన నిర్ణయం విషయంలో ఎలాంటి మార్పు లేదని ఖరాఖండిగా తెలియ జేయడం, కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రయాణాన్ని ముగించేందుకు సిద్ధమని చెప్పడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఇది కేవలం వ్యక్తిగత అసంతృప్తి కాకుండా, ఒక విస్తృత రాజకీయ భావజాల మార్పు సంకేతమా అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతోంది. జీవన్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఆయన కాంగ్రెస్ పార్టీకి ఒక నిబద్ధతగల నాయకుడిగా గుర్తింపు పొందారు. 1970 దశకంలో సర్పం చిగా, మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడుగా, ఆయన రాజకీయ జీవితం, పలు దశాబ్దాల పాటు కొనసాగింది. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్టీ పదవుల్లో పనిచేసి కరీంనగర్ ప్రాంతంలో ఒక బలమైన సామాజిక-రాజకీయ వలయాన్ని నిర్మించుకున్నారు. 1980లలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రాంతంలో బలమైన స్థితిలో ఉన్నప్పుడు ఆయన కీలక పాత్ర పోషించారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన ప్రభావం గణనీయంగా పెరిగింది. అధిష్టానం ఆదేశాల మేరకు రెండుసార్లు కరీంనగర్ లోకసభ స్థానం నుండి తెరాస అధినేత కేసీఆర్ పై పోటీ చేయడం గమనార్హం. అయితే 2014 తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో వచ్చిన రాజకీయ మార్పులు, ప్రాంతీయ పార్టీల పెరుగుదల, ముఖ్యంగా బీఆర్ఎస్ బలోపేతం, కాంగ్రెస్ బలహీనతఇవి ఆయన వంటి సీనియర్ నాయకులపై కూడా ప్రభావం చూపాయి. గణాంకాల పరంగా చూస్తే, 2004లో తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి దాదాపు 50 శాతం ఓటు వాటా ఉండగా, 2018 నాటికి అది 28-30 శాతానికి పడిపోయింది. నాలుగు జిల్లాల పట్టభద్రుల ప్రతినిధిగా ఎమ్మెల్సీగా గెలిచి, శాసన మండలిలో తన గొంతు ద్వారా సత్తా చాటారు. 2023 ఎన్నికలలో కాంగ్రెస్ తిరిగి కొంత పుంజుకున్నప్పటికీ, జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా, నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓటములు రుచి చూడాల్సి వచ్చింది. తర్వాత బి ఆర్ ఎస్ నుండి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ ఆదరించడం, ఆయనకు పార్టీ వ్యవరా ల్లోనూ ప్రాధాన్యత ఇవ్వడం స్థానిక నాయకత్వ విభేదాలు, ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల కేటాయిం పులపై అసంతృప్తులు, వర్గపోరాటాలు ఇంకా కొనసాగుతున్నాయి. జీవన్ రెడ్డి అసంతృప్తి కూడా ఈ విస్తృత సమస్యలలో భాగమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. జీవన్ రెడ్డి పార్టీని వీడే నిర్ణయానికి కారణాలపై అధికారికంగా పూర్తి స్పష్టత రానున్న క్రమంలో, అంతర్గతంగా కొన్ని అంశాలు చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక రాజకీయాల్లో తనకు సరైన ప్రాధాన్యం లభించకపోవడం, నిర్ణయాలలో తన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం, వలస నాయకత్వానికి ప్రాధాన్యం పెరగడం వంటి అంశాలు ఆయన అసంతృప్తికి కారణమయ్యాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మార్చి 25న జగిత్యాలలో జీవన్ రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభ కీలక మలుపుగా మారనుంది. ఈ సభలో ఆయన తన అనుచరులు, అభిమానులు, సహచరులు, సానుభూతిపరులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకుని, తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటించనున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల నుంచి ఆయన అనుచరులు సభకు హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభలో ప్రధాన అంశాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. మొదటిదిఆయన కాంగ్రెస్ పార్టీని అధికారికంగా వీడడం అన్నది. రెండవదితరువాతి రాజకీయ గమ్యం ఏ పార్టీలో చేరతారో స్పష్టం కానున్నది. మూడవదిఆయనతో పాటు ఎంతమంది స్థానిక నాయకులు, కార్యకర్తలు కొత్త మార్గాన్ని అనుసరిస్తారు అన్నది. ఈ మూడు అంశాలు తెలంగాణ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశముంది. విశ్లేషకుల అంచనాల ప్రకారం, జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడితే, కనీసం 10-15 శాతం స్థానిక ఓటు బ్యాంక్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు ఉన్న వ్యక్తిగత అనుబంధం, సామాజిక బలం, వర్గ ఆధారిత మద్దతు ఇవి ఆయన నిర్ణయానికి రాజకీయ బలం చేకూరుస్తాయి. ఇంకా ఒక ముఖ్యమైన అంశంఈ పరిణామం ఇతర అసంతృప్త నాయకులపై చూపే ప్రభావం. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్‌లో కొందరు నేతలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇది పార్టీ లోపలి ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని పరిష్కార మార్గాలను అన్వేషిస్తోంది. మహేష్ కుమార్ గౌడ్, సచిన్ సావంత్ వంటి నేతల జోక్యం కూడా అదే దిశగా జరిగింది. అయినప్పటికీ జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడం, పార్టీకి ఒక హెచ్చరికగా భావించవచ్చు. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాకుండా, సంస్థాగత బలహీనతల ప్రతిబింబం అని చెప్పవచ్చు. రాజకీయ విశ్లేషణ కోణంలో చూస్తే, ఈ పరిణామం తెలంగాణలో వచ్చే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. స్థానిక స్థాయిలో నాయకుల మార్పులు, పార్టీ మార్పులు, వర్గ సమీకరణాలు ఇవి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలు. జీవన్ రెడ్డి నిర్ణయం కూడా అలాంటి ఒక కీలక కారకంగా మారవచ్చు. మొత్తానికి, జగిత్యాలలో జరుగుతున్న ఈ రాజకీయ నాటకం ఒక సాధారణ నాయకుడి పార్టీ మార్పు కాదని, తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద మార్పుకు సంకేతమని చెప్పవచ్చు. మార్చి 25న జరిగే సభ ఈ కథలో తదుపరి అధ్యాయాన్ని రాయనుంది. ఆ సభలో వెలువడే నిర్ణయం కేవలం జీవన్ రెడ్డి భవిష్యత్తును మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తును, అలాగే తెలంగాణ రాజకీయ దిశను కూడా ప్రభావితం చేసే అవకాశముంది.

# నలభై ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి ముగింపు?..

**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)**



జగిత్యాల రాజకీయాల్లో మరో కీలక మలుపు ఆవిర్భవించబోతుంది. ఇది కేవలం ఒక నాయకుడి పార్టీ మార్పు కథ కాదుడ నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నిబద్ధత, ఆశలు, అవమానాలు, మరియు ప్రాంతీయ రాజకీయాల లోతైన అంతర్గత పోరాటాల ప్రతిబింబం. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తీసుకోబోయే నిర్ణయం వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు.. జగిత్యాల రాజకీయ దిశను, ఉత్తర తెలంగాణ శక్తి సమీకరణాలను, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య పోటీతత్వాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లే శక్తి కలిగిన పరిణామం ఇది.ఈ నెల 25న బుధవారం తన కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించి, తన రాజకీయ భవిష్యత్‌పై కీలక నిర్ణయం ప్రకటించనున్నారు. ఇది సాధారణ సమావేశం కాదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో ముడిపడిన ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మలుపు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన అసంతృప్తి, స్థానిక సమీకరణాల్లో ఏర్పడిన వివక్ష ఇవన్నీ ఆయనను ఈ నిర్ణయానికి దారి తీశాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 24 మంగళవారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి జగిత్యాలలో భేటీ అయ్యారు. అయితే, తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లు జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి వచ్చినా.. తాను కాంగ్రెస్ పార్టీలో నిలువగలిగే పరిస్థితులు లేవని ఖరాఖండి గా చెప్పేశారు. ఇప్పటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో కొనసాగడం కుదరదని ఆయన ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు.

**రైతు కుటుంబం నుంచి రాజకీయ శిఖరాల వరకు**

1951 జనవరి 5న జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికే పెల్లి గ్రామంలో జన్మించిన జీవన్ రెడ్డి సాధారణ రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగారు. న్యాయవాదిగా వృత్తి ప్రారంభించిన ఆయన 1981లో పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1983లో టీడీపీ తరపున జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఎన్టీఆర్ కేబినెట్‌లో ఎక్సైజ్ మంత్రిగా పని చేశారు. 1984లో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత 1989 నుంచి 2004 వరకు పలుమార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో రోడ్లు & భవనాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్‌కు ఏకైక విజయం జగిత్యాల్లోనే సాధించిన ఘనత ఆయనది. 2019లో ఎమ్మెల్సీగా కూడా ఎన్నికయ్యారు. ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, రెండు సార్లు మంత్రి ఇది ఆయన రాజకీయ జీవితం సాధించిన స్థాయి. జగిత్యాల ప్రజలు "జీవనన్న"గా పిలిచే ఆయన స్థానిక సమస్యలు, రైతు అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన నాయకుడిగా ప్రసిద్ధి చెందారు.

**స్థానిక అసంతృప్తి నుంచి నిర్ణయం వరకు**

2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదుర్కొన్న జీవన్ రెడ్డి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌తో సంబంధాలు దెబ్బతిన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు, చైర్‌పర్సన్ ఎంపికలో తన వర్గానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, పదవుల పంపకాల్లో ఏర్పడిన వివక్ష ఇవన్నీ ఆయనలో తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. పార్టీ అధిష్టానానికి పలుమార్లు తన అభ్యంతరాలు తెలిపినా సమాధానం లభించకపోవడంతో ఆయన తన రాజకీయ భవిష్యత్‌పై పునరాలోచన చేశారు. గత 20 నెలలుగా తాను మానసిక క్షోభ, అవమానాలు భరిస్తున్నట్లు ఆయన ఇటీవలే బహిరంగ లేఖలో వెల్లడించారు. ఇప్పుడు ఆయన కార్యకర్తల సమావేశంలో తీసుకోనున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. కొన్ని రిపోర్టుల ప్రకారం ఆయన బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, మరికొన్ని వర్గాలు ఇతర ఎంపికలను కూడా చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆయన అనుచరులు ఇప్పటికే సోషల్ మీడియా డీపీలు మార్చుకోవడం, ఇంటి వద్ద ఫ్లెక్సీలు చించేయడం వంటి సంకేతాలు ఇస్తున్నాయి.

**రాజకీయ పరిణామాలు ఏమిటి?**

జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్‌కు ఉత్తర తెలంగాణలో మరో ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే అంతర్గత అసంతృప్తులతో మల్లగుల్లాలుపడుతోంది. మరోవైపు బీఆర్ఎస్‌కు ఇది జగిత్యాలలో కొత్త బలం కలిగించే అవకాశం. కానీ రాజకీయ మార్పులు ఎప్పుడూ ఊహించని ట్విస్టులను తీసుకొస్తాయి. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత ఏ పార్టీలోకి వెళ్లినా, జగిత్యాల సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. మార్చి 25న జరగబోయే కార్యకర్తల సమావేశం ఒక నిర్ణయం ప్రకటించే వేదిక మాత్రమే కాదు.. ఇది తెలంగాణ రాజకీయాల్లో విలువల రాజకీయాలు వర్సెస్ అవకాశవాద రాజకీయాల మధ్య జరుగుతున్న మౌన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒక వైపు నలభై ఏళ్ల విశ్వాసానికి ముగింపు పలకాల్సిన పరిస్థితి, మరోవైపు భవిష్యత్‌లో ప్రభావాన్ని నిలబెట్టుకోవాలనే రాజకీయ అవసరం, ఈ రెండు దారుల మధ్య నిల్చున్న జీవన్ రెడ్డి ఎంచుకునే మార్గం కేవలం ఆయనకే కాదు, ఆయనను నమ్ముకున్న వేలాది కార్యకర్తలకు, జగిత్యాల ప్రజలకు, మరియు మొత్తం రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేసే తీర్పుగా మారబోతోంది. ఈ పరిణామం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది.. పార్టీలు మారినా, నాయకులు మారినా, ప్రజల ఆశలు మాత్రం మారవు. నాయకుల వ్యక్తిగత నిర్ణయాలు కంటే పెద్దది ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే మార్గమే నిజమైన రాజకీయ విజయానికి ప్రమాణం. ఇక జీవన్ రెడ్డి తీసుకునే అడుగు.. చరిత్రలో ఒక అధ్యాయం ముగింపా? లేక కొత్త అధ్యాయం ఆరంభమా?.. అన్నది మరికొన్ని గంటల్లో స్పష్టమవుతుంది.

# పరుగుల జాతర.. వినోదాల ఉత్సవం..

భారతీయ క్రీడా చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, క్రికెట్ మైదానాన్ని ఒక బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా మార్చిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), 2026 మార్చి 28న తన 19వ సీజన్‌ను అత్యంత వైభవంగా ప్రారంభించనుంది. ఇది కేవలం పరుగుల వేట లేదా వికెట్ల పతనం మాత్రమే కాదు; ఇది దేశ ఆర్థిక, సామాజిక, సాంకేతిక పురోగతికి ఒక నిలువుటద్దం. 2008లో ఎనిమిది జట్లతో ఒక చిన్న ప్రయోగంగా ప్రారంభమైన ఈ ప్రయాణం, నేడు ప్రపంచ క్రికెట్ దిశానిర్దేశాన్ని మార్చివేసి, గ్లోబల్ ఎంటర్టైన్‌మెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచింది. 2007లో ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ సాధించిన చారిత్రాత్మక విజయం అందించిన ఉత్సాహంతో, బీసీసీఐ నాటిన ఈ విత్తనం నేడు మహావృక్షమై పది జట్ల విస్తరణతో విశ్వ వ్యాప్తమైంది. 2026 సీజన్ ఒక ప్రత్యేకమైన సంధి కాలంలో ఉంది, ఇక్కడ సాంప్రదాయ క్రికెట్ విలువలు ఆధునిక వ్యాపార వ్యూహాలతో మిళితమై సరికొత్త రూపాన్ని సంతరించుకున్నాయి.ఐపీఎల్ విజయ రహస్యం దాని ఆర్థిక నమూనాలో దాగి ఉంది. ఫ్రాంచైజీ వ్యవస్థ ద్వారా పెట్టుబడిదారులను ఆహ్వానించడం, పారదర్శకమైన వేలం ప్రక్రియ ద్వారా ఆటగాళ్లకు వారి ప్రతిభకు తగ్గ విలువను కట్టడం ఈ లీగ్‌ను ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన క్రీడా వేదికగా మార్చింది. 2026 వేలంలో మనం గమనిస్తే, అనుభవం ఉన్న అంతర్జాతీయ క్రీడాకారుల కంటే భారతీయ యువ ఆటగాళ్లకు కోట్లాది రూపాయల ధర పలకడం గమనార్హం. ఇది భారత దేశీయ క్రికెట్ వ్యవస్థ ఎంత బలంగా ఉందో చాటి చెబుతోంది. ప్రసార హక్కుల విషయంలో కూడా ఐపీఎల్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. టెలివిజన్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల మధ్య నెలకొన్న పోటీ వల్ల బీసీసీఐకి సమకూరుతున్న ఆదాయం, తిరిగి దేశంలోని మౌలిక సదుపాయాల కల్పనకు, అకాడమీల అభివృద్ధికి దోహద పడుతోంది. పర్యాటక రంగం, హోటల్ పరిశ్రమ, రవాణా రంగం వంటి అనుబంధ రంగాలు కూడా ఐపీఎల్ సీజన్‌లో భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి, తద్వారా ఇది దేశ స్థూల జాతీయోత్పత్తికి (+ఙూ) ప్రత్యక్షంగా తోడ్పడుతోంది. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వంటి జట్లు తమకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్‌ను, అశేషమైన అభిమాన గణాన్నీ సంపాదించుకున్నాయి. 2026 సీజన్‌లో ఈ జట్ల మధ్య పోరు కేవలం మైదానానికే పరిమితం కాకుండా, వ్యూహకర్తల మేధోమథనానికి వేదికగా మారుతోంది. మరోవైపు గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్, సన్ రైజర్స్ వంటి జట్లతో లీగ్‌లో పోటీతత్వం మరింత పెరిగింది. ప్రతి జట్టు కనీసం 14 మ్యాచ్‌లు ఆడేలా రూపొందించిన షెడ్యూల్, అభిమానులకు నిరంతర వినోదాన్ని అందించడమే కాకుండా, ఆటగాళ్లకు తమ సత్తా చాటుకోవడానికి తగినన్ని అవకాశాలను కల్పిస్తోంది.

### ఆది శంకరుల అవతారాలు

# నృసింహ భారతి



అద్వైత మత స్థాపనాచార్యులైన ఆది శంకరులు తూర్పున జగన్నాథంలో "గోవర్ధన మఠం", పశ్చిమాన ద్వారకలో "శారదామఠం", ఉత్తరాన కేదారంలో "జ్యోతిర్మఠం", దక్షిణాన శృంగేరి యందు "శృంగగిరి మఠం" స్థాపించి మత కార్యనిర్వహణార్థం దేశం నలు చెరుగులా సంచరించి, అద్వైత తత్వాన్ని వివరించి, దిగ్విజయ యాత్ర కొనసాగించారు. దుష్టాచారాలను నశింప చేసేందుకై కైలాస నాథుడ ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివన్యాసం" స్పష్టపరుస్తున్నది."కరిష్యత్యవతారం స్వం శంకరో నీలలోహిత:, శ్రౌత స్మార్త ప్రష్ఠార్థం భక్తానాం హిత కామ్యాయా". శ్రౌత, స్మార్త క్రియలను సుప్రతిష్ఠం చేసి, వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి త్రినేత్రుడే స్వయంగా శంకరుల రూపంలో అవతరించారని "కూర్మపురాణం" విశదీకరిస్తున్నది. ఆదిశంకరులు స్థాపించిన శృంగగిరి మఠానికి 1989నుండి తంగిరాల సీతారామ ఆంజనేయులు 36వ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి కాగా, ఆయన ఉత్తరాధికారిగా కుప్పా వేంకటేశ్వర ప్రసాద శర్మ "విధుశేఖర భారతీ తీర్థ స్వామి"గా 23వ జనవరి 2015న నియమింప బడి జైత్ర యాత్రలు కొనసాగిస్తున్నారు. కాగా శృంగేరీ మహా సంస్థానానికి 33వ పీఠాధిపతిగా ఉన్న శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ మహాస్వామి శంకరుని అవతారంగా విశ్వవ్యాపిత ప్రశాంసాపాత్రులైనారు. 32వ పీఠాధిపతయైన శ్రీనరసింహ భారతి స్వామి (1817నుండి 1879) తమ 60వ ఏట ధ్యానముద్రలో ఉన్న సమయాన, తమ ఉత్తరాధికారి నియామకం చేయాల్సిన సందర్భాన్ని అశరీర వాణి ద్వారా విని, అందుకు తగిన భవిష్యత్ ఆచార్యత్వానికై, ఎన్నో జాతకాలు తెప్పించుకుని, పరిశీలించారు. ఇందుకు 8ఏళ్ళ సమయం తీసుకున్నారు. తగిన వ్యక్తి జాతకాన్ని పొందారు. మైసూరుకు చెంది, శివస్వామి పేరు గలిగిన ఏడు ఏళ్ళ బాలుడిని పిలిపించుకుని, తమ పక్కనే ఆసీనుని గావించుకుని, ఆ బాలుడు ఏమి కావాలని అనుకుంటున్నాడని ప్రశ్నించారు. అప్పుడా బాలుడు సదరు సందర్భోచితంగా, ఉపనిషత్ సూత్రాలకు అనుసరణీయమైన, గురువు మానవ రూపంలోనున్న దైవమని సంస్కృత శివ స్తోత్రం పఠించారు. అలా శివస్వామి సమాధానం జగద్గురువుల ఆనందానికి పాత్రమైంది. 1886లో నృసింహ భారతి స్వామి, శివస్వామిని, "శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహ భారతి"గా యోగపట్టానొసంగి, దీక్షాదక్షుల చేశారు. ఎనిమిదేళ్ళ యువ సన్యాసి సుదీర్ఘ సాంప్రదాయ కర్మల సమన్వయ కారణంగా రోజంతా శ్రమించిన అనంతరం, అలసట చెంది, విశ్రాంతి తీసుకొన్నారు. అయితే తమ నిద్రాణ స్థితిలో సర్వోహం సర్వోహం అంటూ నినదించారు. తద్వారా ఆ బాలకుని అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తి వ్యక్తీకరణకు జగద్గురువులే ఆశ్చర్య చకితులైనారు. అలా జగద్గురు ఆశీస్సులతో సకల విద్యా పారంగులైనారు. 12ఏళ్ళు గురువుతో పర్యటనలకు వెళ్ళి, శృంగేరికి తిరిగి వచ్చి, 1879లో పరమాచార్యులకు దేహ విముక్తి కాగా,1858లో ఫాల్గుణ బహుళ ఏకాదశి నాడు గురువారము, శ్రవణ నక్షత్రమున మకర రాశి యందు రాత్రి తొమ్మిది గంటలకు మగ పిల్లవాడు జన్మించి, 'శివస్వామి' అని నామకరణం చేయబడిన శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామి శృంగేరీ పీఠాధీశ్వరులైనారు. 1912 మార్చి 20న పరమాచార్య విదేహ ముక్తినొందగా, నరసింహ వనంలో ఖననం చేయబడగా, ఆయన సమాధిపై లింగ ప్రతిష్ఠ జరిగింది. ఏప్రిల్ 7న చంద్రశేఖర భారతీ స్వామి పీఠాధీశులైనారు. ఆది శంకరభగవత్పాదులకు, శివాభివన నృసింహ భారతి స్వామికి అనేక పోలికలున్నాయి. ఈయన కూడా ఆది శంకరులకు వలెనే బాల్యంలో పితృవియోగులైనారు. శివస్వామి తమ సోదరుని ద్వారా ఉపనయన సంస్కారం చేయించబడి, వేదం సంస్కృతాధ్యయనానికి ఉద్యుక్తులైనారు. దేశమంతా తిరిగి జనబాహుళ్యానికి సనాతన ధర్మాన్ని బోధించారు. శృంగేరిలో సద్విద్య సంజీవని పేరున పాఠశాలను స్థాపించి, వేదాలు, సంస్కృతాధ్యయనాలకు ఏర్పాట్లు గావించారు. బెంగళూరులో కళ్యాణ నగరిలో భారతీయ ప్రౌఢ విద్యాభిర్వర్ధిని శాస్త్ర పాఠశాలను నెలకొల్పి, పూర్వ ఉత్తర మీమాంస శాస్త్రాల సాంప్రదాయ అధ్యయన ఏర్పాట్లు చేశారు. ఆది శంకర జన్మస్థలమైన కాలడి పునరుజ్జీవనం గురించి యోచించారు. ఎందరో సన్యాసులు పరమాచార్య వద్ద శిక్షణ పొందారు. విద్యాభ్యాసం చేశారు. ముఖ్యులలో శ్రీవేంకటరమణ సరస్వతి, శ్రీ భారతీ కృష్ణ తీర్థగా మారి గోవర్ధన పీఠాధిపతిగా మారారు. కే.రామచంద్ర అయ్యర్, సిద్ధ శ్రీరామానంద సరస్వతిగా మారారు. సిద్ధ విల్లిమలై శ్రీసచ్చిదానంద జగద్గురువుల వద్ద దీక్ష మొదట స్వీకరించి, అర్ధనారిగా మారి వైర్యాగ్యాన్ని పొంది వానప్రస్తాశ్రమాన్ని స్వీకరించారు. వివిధ దేవాలయాల సందర్శనా సందర్భాలలో జగద్గురు నోట జాలువారిన శ్లోకాలు భక్తి సుధా తరంగిణి సంపుటిగా ప్రచురితాలైనాయి. హిందువులే కాక, ముస్లింలు, క్రైస్తవులు, ఆయనలో పవిత్రత, స్వచ్ఛత, దైవత్వాలను చూశారు. ఆచార్యునితో సంభాషణ జీవితంలోని కలవరం, సంక్షోభాలను దూరం చేశాయని ట్యూటర్ ఫ్రాజర్ ఒప్పుకున్నారు. జగద్గురువులు ఉత్తమ గుణ సంపన్నులని, ఆకర్షిత వ్యక్తిత్వమని, వేదాంత శాస్త్ర చిక్కుముడులను విప్పడంలో పరిపూర్ణ సాధికారికత కలవారని, ఎందరికో సమస్యల పరిష్కర్తగా వ్యవహరించారని, మతం పేరుతో అనైతిక అనుసరణలను ఖండించి, వైదిక ధర్మాన్ని బోధించిన మహనీయులని ఛార్లెస్ జాన్సన్ పేర్కొన్నారు.